సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
బుధవారం, 18.11.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:14 సంచిక: 011
పేజీలు: 08 వెల: రూ. 5



సమ్మక్క సాగర్‌కు లైన్ క్లియర్

ఎన్ఓసీ జారీకి ఛత్తీస్‌గఢ్ సీఎం హామీ!

- రేవంత్ భేటీతో అనుమతుల ప్రక్రియలో ముందడుగు
- త్వరలోనే సమ్మక్క సాగర్‌లో నీటి నిల్వకు అవకాశం
- 6.94 టీఎంసీల నీటి నిల్వే లక్ష్యంగా అడుగులు
- ముంపు భూములపై ఐఐటీ ఖరగ్‌పూర్ అధ్యయన నివేదిక
- సమ్మక్క సాగర్‌తో తెలంగాణ సాగు, తాగునీటి అవసరాలకు ఊరట

ముద్ర, రాయ్‌పూర్:
తెలంగాణలో కీలకమైన సమ్మక్క సాగర్ బ్యారేజీకి సంబంధించి అనుమతుల ప్రక్రియలో ముందడుగు పడింది. బ్యారేజీలో నీటి నిల్వకు అవసరమైన నిరభ్యంతర పత్రం (NOC) త్వరగా జారీ చేసేందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్‌తో జరిపిన భేటీలో హామీ లభించింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి రాయ్‌పూర్‌లో మంగళవారం రేవంత్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.
సమ్మక్క సాగర్ బ్యారేజీకి సంబంధించిన NOCతో పాటు మిగిలిన అనుమతులను కూడా త్వరితగతిన మంజూరు చేయాలని రేవంత్ రెడ్డి కోరారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని, భవిష్యత్తులో తెలంగాణలో సాగు, తాగునీటి అవసరాలు పెరిగే అవకాశముందని ఛత్తీస్‌గఢ్ సీఎంకు వివరించారు. బ్యారేజీలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.
తుపాకులగూడెం వద్ద నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ పూర్తిస్థాయి నీటిమట్టం +83 మీటర్లు కాగా, దీని నిల్వ సామర్థ్యం 6.94 టీఎంసీలు. తొలుత కాంతనపల్లి వద్ద ఈ ప్రాజెక్టును ప్రతిపాదించినప్పటికీ, అక్కడ భూసేకరణ, ఆదివాసీ గ్రామాల ముంపు సమస్యలు తలెత్తే అవకాశం ఉండటంతో నిర్మాణ ప్రాంతాన్ని తుపాకులగూడెంకు మార్చారు. ఈ ప్రాజెక్టు అధ్యయనం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన మేరకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రూ.9.883 కోట్లు చెల్లించింది. ఐఐటీ ఖరగ్‌పూర్ జూలై 30న తన అధ్యయన నివేదికను సమర్పించింది. తుపాకులగూడెం వద్ద బ్యారేజీ నిర్మాణం వల్ల ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 33 ఎకరాలు మాత్రమే ముంపునకు గురయ్యే అవకాశం ఉందని నివేదికలో వెల్లడైంది. భారీ వరదల సమయంలోనూ ప్రభావిత ప్రాంతం 100 ఎకరాలకు మించదని అంచనా.
భూములు కోల్పోయే వారికి పరిహారం, పునరావాసం, భూసేకరణకు సంబంధించిన నిధులను నిబంధనల ప్రకారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన బ్యారేజీ ద్వారా గోదావరి జలాలను కరువు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాలకు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం త్వరగా NOC జారీ చేస్తే ప్రాజెక్టు ద్వారా నీటి నిల్వ, వినియోగానికి సంబంధించిన తదుపరి ప్రక్రియ వేగవంతం కానుంది.

గోదావరి వస్తోంది

హైదరాబాద్ తాగునీటికి భారీ ఊరట!

గోదావరి జలాల తరలింపు ప్రక్రియ షురూ

- సింగూరుపై తగ్గనున్న భారం..
- లింగంపల్లి రిజర్వాయర్‌కు రేపటి నుంచి అదనంగా 55 ఎంజీడీల నీరు..
- జనవరి నెలాఖరు వరకు తాగునీటి భరోసా
- ఎల్‌నినో ప్రభావంతో తగ్గుతున్న సింగూరు నిల్వలు..
- ముందస్తు చర్యలకు దిగిన జలమండలి..
- వెలిమల వద్ద పైపులైన్ అనుసంధానం పూర్తి

ముద్ర, తెలంగాణ బ్యూరో :
హైదరాబాద్ నగరవాసులకు తాగునీటి విషయంలో భారీ ఊరట లభించనుంది. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో జలమండలి కీలక ముందస్తు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా హైదరాబాద్ తాగునీటి అవసరాలకు ప్రధాన ఆధారాల్లో ఒకటైన సింగూరు జలాశయంలో నీటి మట్టాలు రోజురోజుకూ పడిపోతుండటంతో ప్రత్యామ్నాయ నీటి వనరులపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా గోదావరి జలాలను నగరానికి మరింత ఎక్కువగా తరలించే ప్రణాళికను కార్యరూపంలోకి తీసుకొచ్చింది. ఈ చర్యతో సైబరాబాద్ పరిధిలోని ప్రజలకు రానున్న రోజుల్లో తాగునీటి సరఫరాపై భరోసా కల్పించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.
వెలిమల వద్ద కీలక అనుసంధానం
పటాన్‌చెరు సమీపంలోని వెలిమల వద్ద గోదావరి జలాలను మంజీరా నీటి సరఫరా వ్యవస్థలోకి మళ్లించేందుకు చేపట్టిన పైపులైన్ అనుసంధాన పనులు పూర్తయ్యాయి. 1,800 ఎంఎం, 1,200 ఎంఎం సామర్థ్యం కలిగిన మిగతా 02లో



ఐపీఎల్‌కు గుడ్ బై

కూల్‌గా చెప్పిన ధోనీ

2



- సీఎస్‌కే మెంటార్‌గా సరికొత్త బాధ్యతలు
- రిలీజ్ లిస్టులో తన పేరు చేర్చండంటూ ధోనీ వ్యాఖ్య
- ధోనీ లేని సీఎస్‌కేను ఊహించలేమన్న శ్రీనివాసన్
- ఐదు ఐపీఎల్ ట్రోఫీలు అందించిన రికార్డు కెప్టెన్

మందుబాబులకు షాకింగ్ న్యూస్

ఖరీదైన బాటిల్స్ లో చీప్ లిక్కర్ విక్రయాలు

- రూ.560 మద్యాన్ని వేలల్లో విక్రయం!
- జానీ వాకర్ పేరుతో కల్తీ దందా!
- హైదరాబాద్‌లో కల్తీ మద్యం ముఠా అరెస్ట్!
- ఖరీదైన బ్రాండ్ల పేరుతో మందుబాబులకు టోకరా!

2



ఇండో-పసిఫిక్‌కు క్వాడ్ భరోసా

- మోదీపై ట్రంప్ ప్రశంసల వర్షం!
- 'మోదీ వెరీ టఫ్ మ్యాన్.. గొప్ప నాయకుడు' అంటూ ట్రంప్ కితాబు..
- సముద్ర భద్రత, వాణిజ్య మార్గాలు, సాంకేతికతపై అగ్రనేతల కీలక చర్చ



ఐపీఎల్ వేలానికి ప్లేయర్లు!

ట్రావిస్ హెడ్‌కు ఎస్ఆర్‌హెచ్ గుడ్‌బై!

- కావ్య మారన్ సంచలన నిర్ణయం!
- ఐపీఎల్ వేలానికి స్టార్ ప్లేయర్లు!
- హైదరాబాద్ జట్టులో భారీ మార్పులు!
- డిసెంబర్ 16న ఆటగాళ్ల మెగా పోరు!



3

రియల్ ఎస్టేట్ సంస్థలకు రెరా షాక్

- రూ.25 లక్షల జరిమానా!
- ఫ్లాట్ల అప్పగింతలో జాప్యమా? వడ్డీతో సహా డబ్బులు వెనక్కివ్వాల్సిందే!
- రూల్స్ బ్రేక్ చేస్తే అంతే సంగతులు.. బిల్డర్లపై రెరా కొరడా!
- కొనుగోలుదారుల సౌమ్ముకు భరోసా.. పలు సంస్థలకు రెరా భారీ షాక్!



2

ఆంధ్రప్రదేశ్‌కు తుపాన్ ముప్పు

ప్రజలను అప్రమత్తం చేయాలన్న సీఎం చంద్రబాబు



- అక్వాన్ తుపానుపై సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- ఈ నెల 19, 20 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం
- మచిలీపట్నానికి 660 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైన తుపాను
- ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయాలని ఆదేశం

2

కాంగ్రెస్ మేనిఫెస్టో మోసానికి మూడేళ్లు

అభయహస్తం కాస్తా శూన్యహస్తమైంది



- కాంగ్రెస్ మేనిఫెస్టోను మోసాల చిట్టాగా అభివర్ణించిన హరీశ్‌రావు
- పవిత్ర గ్రంథాల మీద చేసిన ప్రమాణాలను గాలికొదిలేశారని విమర్శలు
- 38 క్యాబినెట్ భేటీలు జరిగినా 6 గ్యారెంటీలకు చట్టబద్ధత ఏదని ప్రశ్న

2

ఇదీ AI ముద్ర

మోదీ గొప్ప వ్యక్తి. అవసరమైతే చాలా కఠినంగా వ్యవహరిస్తారు.. టఫ్ మ్యాన్ అని క్వాడ్ సదస్సులో ట్రంప్ ప్రశంసలు కురిపించారు



ఇన్వెస్ట్ తెలంగాణ

అహ్మదాబాద్‌లో గ్లోబల్ సమ్మిట్ రోడ్ షో

- 189 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ.. 10.75 శాతం వృద్ధి
- డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, ఈవీ, ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో పెట్టుబడులకు ఆహ్వానం

దక్షిణాదిలో హైదరాబాద్‌ను రెండో వ్యాపార కేంద్రంగా మలచుకోండి: మంత్రి శ్రీధర్‌బాబు



3

తెలంగాణ ప్రస్తావన ఏది?

బిలాంగింగ్ ఏ జర్నీ ఆఫ్ లవ్‌పై నిలదీసిన కేటీఆర్

- తెలంగాణ ఇచ్చింది సోనియమ్మే అయితే సమాధానం చెప్పాలని డిమాండ్
- ఇది ప్రజల పోరాట ఫలితం.. సోనియా దయాభిక్ష కాదని స్పష్టీకరణ
- ఉద్యమ కాలం పాదయాత్రను గుర్తు చేసుకుంటూ పోస్ట్



2

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews

బుధవారం,
18 నవంబర్, 2026

టీతో బిస్కెట్లు రోజూ తినొద్దు!

టీతో పాటు బిస్కెట్లు తినడం చాలామందికి అలవాటు. అయితే మార్కెట్లో లభించే బిస్కెట్లలో మైదా, చక్కెర ఎక్కువగా ఉంటాయి. వీటిని తరచూ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ఖాళీ కడుపుతో ఈ కాంబినేషన్‌కు దూరంగా ఉండాలి.



ఐపీఎల్‌కు ధోనీ గుడ్ బై

ముద్ర, చెన్నై:
క్రికెట్ ప్రపంచంలో ఒక అద్భుత శకం ముగిసింది. భారత మాజీ సారథి, చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)కు వీడ్కోలు పలికాడు. ఆటగాడిగా మైదానాన్ని వీడినప్పటికీ, సీఎస్‌కేతో అతడి అనుబంధం కొనసాగనుంది. ఐపీఎల్ 2027 సీజన్ నుంచి ధోనీ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు 'టీమ్ మెంటార్'గా సరికొత్త బాధ్యతలు నిర్వర్తించనున్నాడు.
ధోనీ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ఎలా తెలియజేశాడో సీఎస్‌కే యజమాని రూపా గురునాథ్ ఒక ప్రత్యేక వీడియో ద్వారా పంచుకున్నారు. వచ్చే సీజన్ కోసం ఆటగాళ్ల విడుదల (రిలీజెస్), వ్యూహాలపై శనివారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ పరిణామం చోటుచేసుకుంది. సీఎస్‌కే ఎండీ కాశీ విశ్వనాథన్ విడుదల చేయాల్సిన ఆటగాళ్ల జాబితాను చదువుతుండగా, ధోనీ చాలా నిశ్శబ్దంగా స్పందిస్తూ.. "బహుశా ఆ జాబితాలో నా పేరు కూడా చేరిస్తే మంచిదేమో" అని అన్నాడని రూపా గురునాథ్ వెల్లడించారు. ఆ మాట విన్న వెంటనే తామంతా తీవ్ర భావోద్వేగానికి గురయ్యామని, జట్టుకు 200 శాతం న్యాయం చేయలేనప్పుడు మైదానంలో కొనసాగడం ధోనీ నైజం కాదని ఆమె పేర్కొన్నారు. ఇకపై ధోనీ మెరుపు స్టంపింగ్స్, హెలికాప్టర్ షాట్లు మైదానంలో కనిపించవనే నిజాన్ని జీర్ణించుకోవడం కష్టంగా ఉందని, అయితే కొత్త తరం ఆటగాళ్లకు మార్గదర్శనం చేసేందుకు మెంటార్‌గా ఆయన రాకను స్వాగతిస్తున్నామని చెప్పారు.
సీఎస్‌కే అధినేత ఎన్ శ్రీనివాసన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ధోనీ గొప్పతనాన్ని కొనియాడారు. "ధోనీ లేని సీఎస్‌కేను ఊహించలేము. దాదాపు రెండు దశాబ్దాలుగా మేము కలిసి ఎదిగాం. 2008 ఐపీఎల్ వేలంలో ధోనీని కెప్టెన్‌గా ఎంపిక చేయడమే మా జీవితంలో తీసుకున్న అత్యుత్తమ నిర్ణయం. ట్రోఫీల కోసం మాత్రమే కాదు, అతడి వ్యక్తిత్వం పరంగా చూసినా ఆ నిర్ణయం చాలా గొప్పది. చెన్నై సూపర్ కింగ్స్ ఎప్పటికీ అతడి సొంత ఇల్లే" అని శ్రీనివాసన్ స్పష్టం చేశారు.
సీఎస్‌కే మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్ సైతం ధోనీ సేవలను గుర్తు చేసుకున్నారు. చెన్నె నగరంతో, అభిమానులతో ధోనీ విడదీయరాని బంధాన్ని ఏర్పరచుకున్నాడని తెలిపారు. ట్రోఫీలు గెలవడమే కాకుండా, వాటిని గెలిచిన విధానమే ధోనీ వారసత్వాన్ని ఉన్నతంగా నిలబెట్టిందని, మెంటార్‌గా అతడు ఇచ్చే సలహాలు భవిష్యత్ తరానికి ఎంతో విలువైనవని పేర్కొన్నారు.
ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకడైన ధోనీ, సీఎస్‌కేను 5 సార్లు ఛాంపియన్‌గా నిలబెట్టడంతో పాటు రెండు ఛాంపియన్స్ లీగ్ టీ20 టైటిళ్లను అందించాడు. చెన్నె తరపున అత్యధికంగా 272 మ్యాచ్‌లు ఆడిన ధోనీ, 5,314 పరుగులతో జట్టులో రెండో అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు. ఉత్కంఠ సమయాల్లో ప్రశాంతంగా మ్యాచ్‌లను ముగించడం, అనూహ్య ఫీల్డింగ్ మార్పులతో ఫలితాలను మార్చేయడం అతడి ప్రత్యేకత. ఇప్పుడు ఆటగాడి పాత్ర నుంచి గురువు పాత్రలోకి అడుగుపెడుతున్న ధోనీ ఇన్నింగ్స్‌ను చూసేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

గోదావరి వస్తోంది

(మొదటి పేజీ తరువాయి)
పైపులను ప్రత్యేక జంక్షన్లు, వాల్వుల ద్వారా అనుసంధానించారు. ఈ పనులు పూర్తికావడంతో గోదావరి నుంచి వచ్చే అదనపు నీటిని లింగంపల్లి రిజర్వాయర్‌కు తరలించేందుకు మార్గం సుగమమైంది. బుధవారం నుంచి ఈ సరఫరా ప్రారంభం కానుంది. జలమండలి సైబరాబాద్ ఈడీ సంతోష్ రెడ్డి కూడా అనుసంధాన పనులు పూర్తయ్యాయని, బుధవారం నుంచి నీటి సరఫరా అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు.



రోజుకు 55 ఎంజీడీల అదనపు నీరు
ఈ కొత్త ఏర్పాటులో భాగంగా రోజుకు అదనంగా 55 మిలియన్ గ్యాలన్ల (ఎంజీడీ) గోదావరి జలాలు లింగంపల్లి రిజర్వాయర్‌కు చేరనున్నాయి. అంటే దాదాపు 20.8 కోట్ల లీటర్ల నీరు అదనంగా అందుబాటులోకి వచ్చినట్లే. ప్రస్తుతం సింగూరు నుంచి 70 ఎంజీడీలు, మంజీరా నుంచి 40 ఎంజీడీలు, కృష్ణా నుంచి 20 ఎంజీడీల నీరు లింగంపల్లి రిజర్వాయర్‌కు చేరుతోంది. ఈ నేపథ్యంలో గోదావరి నీటి లభ్యత పెరగడంతో ఇతర జలవనరుల నుంచి తీసుకునే నీటి పరిమాణాన్ని తగ్గించి, వాటిలోని నిల్వలను కాపాడుకోవాలని జలమండలి భావిస్తోంది. ముఖ్యంగా రోజువారీ వినియోగాన్ని సమతుల్యం చేస్తూ సింగూరు, మంజీరా, కృష్ణా జలాలపై ఒత్తిడి తగ్గించడమే ఈ ప్రణాళిక ప్రధాన ఉద్దేశం.


జనవరి వరకు తాగునీటికి భరోసా
ప్రస్తుతం జలమండలి ముందున్న ప్రధాన సవాలు సింగూరు జలాశయంలో తగ్గుతున్న నీటి నిల్వలు. ఎల్‌నినో పరిస్థితులు, వర్షాభావ ప్రభావంతో జలాశయంలోకి ఆశించిన స్థాయిలో నీరు చేరకపోవడంతో అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు నగరంలో జనాభా పెరుగుదల, వేసవి అవసరాలు, పెరుగుతున్న నీటి డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని అధికారులు ముందుగానే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. లింగంపల్లి రిజర్వాయర్‌కు అదనపు గోదావరి నీరు చేరితే సైబరాబాద్ పరిధిలోని ప్రాంతాలకు సరఫరా చేయడానికి వీలవుతుంది. ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ ఏర్పాటుతో జనవరి నెలాఖరు వరకు తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడవచ్చని అధికారులు భావిస్తున్నారు.

వేసవిని దృష్టిలో పెట్టుకుని వ్యూహం
జనవరి నెలాఖరు వరకు నీటి సరఫరాకు భరోసా లభించినప్పటికీ, ఆ తర్వాత పరిస్థితులు ఎలా ఉంటాయన్నది కీలకంగా మారనుంది. ముఖ్యంగా 2027 వేసవిలో హైదరాబాద్ తాగునీటి అవసరాలు మరింత పెరిగే అవకాశం ఉంది. సింగూరు, మంజీరా జలాశయాల నుంచి జనవరి నుంచి ఆగస్టు మధ్య రోజుకు సుమారు 100 ఎంజీడీల నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని జలమండలి అంచనా వేస్తోంది. ఈ లోటును అధిగమించేందుకు గోదావరితో పాటు కృష్ణా, ఉస్మాన్‌సాగర్ జలాలను కూడా ప్రత్యామ్నాయంగా వినియోగించుకునే ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. మరోవైపు నీటి వృథాను అరికట్టడం, పైపులైన్లలో లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టడం, అవసరానికి మించి నీటిని వినియోగించకుండా ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి చర్యలపైనా జలమండలి దృష్టి సారిస్తోంది. నగరంలోని అన్ని ప్రాంతాలకు సమానంగా నీటిని పంపిణీ చేయడం, అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ వనరులను అందుబాటులో ఉంచడం వంటి అంశాలపై అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

సైబరాబాద్ ప్రజలకు ప్రయోజనం
లింగంపల్లి రిజర్వాయర్‌కు గోదావరి జలాలు చేరడం వల్ల సింగూరు, మంజీరా వ్యవస్థలపై ఆధారపడే సైబరాబాద్ ప్రాంతాలకు ప్రధానంగా ప్రయోజనం చేకూరనుంది. ఐటీ కారిడార్‌తో పాటు వేగంగా విస్తరిస్తున్న నివాస ప్రాంతాల్లో నీటి డిమాండ్ నిరంతరం పెరుగుతోంది. కొత్త అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, వాణిజ్య సముదాయాల కారణంగా భవిష్యత్తులో నీటి అవసరాలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో గోదావరి జలాల అదనపు తరలింపు నగర నీటి సరఫరా వ్యవస్థకు కీలక మద్దతుగా నిలవనుంది. మొత్తానికి సింగూరు జలాశయంలో నీటి నిల్వలు తగ్గుతున్న వేళ గోదావరి జలాలను మళ్లించేలా జలమండలి చేపట్టిన ఈ చర్య హైదరాబాద్‌కు తాత్కాలికంగా పెద్ద ఊరట నిచ్చే అవకాశం ఉంది. ప్రత్యామ్నాయ నీటి వనరులను ముందుగానే సిద్ధం చేసుకోవడం ద్వారా రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులను తగ్గించవచ్చని అధికారులు ఆశిస్తున్నారు. అయితే జనవరి తర్వాత కూడా ఇదే స్థాయిలో సరఫరాను కొనసాగించాలంటే ఇతర జలవనరుల వినియోగం, నీటి పొదుపు, అదనపు సరఫరా ఏర్పాట్లు కీలకం కానున్నాయి.

ఏపీకి తుపాను ముప్పు

ముద్ర, అమరావతి:
బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తుపాను తీరం దిశగా దూసుకువస్తున్న నేపథ్యం లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను తీవ్రత, కదలికలు, ముందస్తు జాగ్రత్తలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తాజా పరిస్థితులను సమీక్షించిన సీఎం, విపత్తు నిర్వహణ విభాగంతో పాటు తీరప్రాంత జిల్లాల యంత్రాంగాన్ని పూర్తిగా అప్రమత్తం చేశారు.
వాతావరణ శాఖ వివరాల ప్రకారం.. ప్రస్తుతం అక్వాన్ తుపాను చెన్నెకి 610 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 660 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 670 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 790 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ తుపాను ప్రభావంతో రాష్ట్రంలో ఈ నెల 19, 20 తేదీల్లో విస్తారంగా భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు సీఎంకు వివరించారు.
తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారాన్ని, హెచ్చరికలను పంపేందుకు పటిష్టమైన సమాచార వ్యవస్థను అందుబాటులో ఉంచాలని చంద్రబాబు ఆదేశించారు. ఇందులో భాగంగా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బందిని క్షేత్రస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. సిబ్బంది నేరుగా ప్రజల వద్దకు వెళ్లి తుపాను ముప్పుపై అవగాహన కల్పించాలని, అవసరమైన రక్షణ చర్యలపై వారికి సమాచారం అందించాలని ఆదేశించారు.
సముద్రం అల్లకల్లోలంగా మారే సూచనలు ఉండటంతో మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆయన దిశానిర్దేశం చేశారు.



మేనిఫెస్టో మోసానికి మూడేళ్లు

ముద్ర, హైదరాబాద్ :
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సరిగ్గా మూడేళ్ల క్రితం విడుదల చేసిన మేనిఫెస్టోను మోసాల చిట్టాగా మార్చేశారని 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. ప్రజలకు అండగా ఉంటామని చెప్పిన 'అభయహస్తం' కాస్తా, నేడు ప్రజలకు ఏమీ ఇవ్వని 'మొండిహస్తం', 'శూన్యహస్తం'గా మారిపోయిందని ఎద్దేవా చేశారు.
మల్లికార్జున ఖర్గే సమక్షంలో మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్ వంటి పవిత్ర గ్రంథాలతో సమానంగా భావించి ప్రతి హామీని అమలు చేస్తామని నాడు రేవంత్ రెడ్డి ప్రమాణం చేశారని హరీశ్‌రావు అన్నారు. మూడేళ్లు గడిచినా ఒక్క హామీ కూడా నెరవేరలేదని ఆరోపించారు. ఓట్లేసిన ప్రజలనే కాకుండా ప్రమాణం చేసిన పవిత్ర గ్రంథాలను కూడా కాంగ్రెస్ మోసం చేసిందని దుయ్యబట్టారు. గాంధీభవన్‌లో ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేకపోయారో రేవంత్ రెడ్డి, ఖర్గే, శ్రీధర్ బాబు, భట్టి విక్రమార్క ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
తొలి మంత్రివర్గ సమావేశంలోనే 'ఆరు గ్యారెంటీ'లకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పటివరకు 38 క్యాబినెట్ భేటీలు నిర్వహించినా ఎందుకు ఆ పని చేయలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను నట్టేట ముంచారని విమర్శించారు. హామీలను ఎగ్గొట్టి ప్రజలను వంచించడమే కాంగ్రెస్ ఏకైక విజయమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మోసపూరిత విధానాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ఇండో-పసిఫిక్‌కు క్వాడ్ భరోసా

ముద్ర, న్యూఢిల్లీ:
ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత, స్థిరత్వానికి క్వాడ్ కూటమి విశ్వసనీయ పరిష్కారాలను అందిస్తోందని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. సముద్ర భద్రత, సరఫరా గొలుసులు, నూతన సాంకేతికతలు, విపత్తుల సమయంలో తక్షణ స్పందన వంటి కీలక రంగాల్లో క్వాడ్ నిర్మాణాత్మక భాగస్వామిగా పనిచేస్తోందని పేర్కొన్నారు. మరోవైపు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రధాని మోదీ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''మోదీ వెరీ టఫ్ మ్యాన్.. ఆయన గొప్ప నాయకుడు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో గౌరవం పొందుతున్నారు' అంటూ కొనియాడారు. దీంతో మనీలా వేదికగా జరిగిన క్వాడ్ అగ్రనేతల సమావేశం అంతర్జాతీయంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో మంగళవారం జరిగిన క్వాడ్ సమావేశంలో ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, జపాన్ ప్రధాని సనే తకైచి, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మోదీ.. క్వాడ్ కూటమి కేవలం నాలుగు దేశాల ప్రయోజనాలకే పరిమితం కాదని, మొత్తం ఇండో–పసిఫిక్ ప్రాంతానికి ఉపయోగపడేలా పనిచేస్తోందని వివరించారు. కూటమి తదుపరి దశలో మరింత స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మనీలా నగరంతో క్వాడ్‌కు ఉన్న చారిత్రక అనుబంధాన్ని కూడా మోదీ గుర్తుచేశారు. 2007లో నాలుగు దేశాలు తొలిసారిగా మనీలాలో సమావేశమయ్యాయని, 2017 లో తిరిగి ఇదే వేదికపై చర్చలను పునఃప్రారంభించాయని తెలిపారు. 2026లో మరోసారి ఇక్కడ సమావేశం కావడం కీలక మైలురాయిగా అభివర్ణించారు. ఇప్పటివరకు నాలుగు దేశాల విదేశాంగ మంత్రులు ఐదుసార్లు సమావేశమయ్యారని, ఇది పరస్పర నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.

మోదీపై ట్రంప్ ప్రశంసలు
క్వాడ్ నేతల ఫొటో సెషన్ సందర్భంగా ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రత్యేకంగా నిలిచాయి. ప్రధాని మోదీని ఉద్దేశించి ఆయన 'ఆయన చాలా టఫ్ మ్యాన్' అని వ్యాఖ్యానించారు. అనంతరం గొప్ప నాయకుడని, ప్రపంచవ్యాప్తంగా గౌరవం పొందుతున్నారని ప్రశంసించారు. జపాన్ ప్రధాని సనే తకైచి మరింత కఠినంగా ఉండవచ్చని సరదాగా వ్యాఖ్యానించారు. ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్‌తో పాటు తనను కూడా ప్రస్తావిస్తూ చమత్కరించారు. ట్రంప్ వ్యాఖ్యలతో అక్కడ నవ్వులు విరిశాయి.

చైనాకు దౌత్య సంకేతాలా?
ఈ సమావేశంలో ఇండో–పసిఫిక్ ప్రాంతంలోని సముద్ర మార్గాల రక్షణ, వాణిజ్య భద్రత, కీలక ఖనిజాల సరఫరా, వ్యూహాత్మక సాంకేతికతలపై ప్రధానంగా చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. క్వాడ్‌లో సభ్యత్వం లేని ఫిలిప్పీన్స్‌లో ఈ సమావేశం జరగడం కూడా వ్యూహాత్మకంగా ప్రాధాన్యం సంతరించుకుంది. దక్షిణ చైనా సముద్రంలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ భేటీకి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. మొత్తంగా, మోదీ ఇండో–పసిఫిక్ ప్రాంతానికి క్వాడ్ ద్వారా విశ్వసనీయ భాగస్వామ్యాన్ని అందించడంపై దృష్టి సారిస్తే, ట్రంప్ బహిరంగ వేదికపై మోదీ నాయకత్వాన్ని ప్రశంసించడం ఈ సమావేశానికి మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది.

రియల్ ఎస్టేట్ సంస్థలకు రెరా షాక్

ముద్ర, హైదరాబాద్:
రియల్ ఎస్టేట్ రంగంలో నిబంధనలను తుంగలో తొక్కుతున్న నిర్మాణ సంస్థలకు తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (తెలంగాణ రెరా) షాక్ ఇచ్చింది. ప్రాజెక్టుల పేరుతో కొనుగోలుదారుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి, సకాలంలో నిర్మాణాలు పూర్తి చేయకపోవడం, ఫ్లాట్లు, ప్లాట్ల అప్పగింతలో తీవ్ర జాప్యం చేయడం, ఇచ్చిన రిఫండ్ హామీలను అమలు చేయకపోవడంపై అథారిటీ స్పందించింది. నిబంధనలు ఉల్లంఘించిన పలు సంస్థలకు భారీ జరిమానాలు విధించడంతో పాటు, కొనుగోలుదారులకు వడ్డీతో సహా సొమ్మును తిరిగి చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా.. మంచిరేవులలో రెరా రిజిస్ట్రేషన్ లేకుండానే 'సనాలిది ఎడ్జ్' ప్రాజెక్టును ప్రచారం చేస్తున్న 'సనాలి ఐటీ పార్క్స్' సంస్థపై రెరా కొరడా ఝుళిపించింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు ఆ సంస్థకు ఏకంగా రూ.25 లక్షల జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని 30 రోజుల్లోగా చెల్లించాలని, రెరా రిజిస్ట్రేషన్ పొందే వరకు సదరు ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని రకాల ప్రకటనలు, బుకింగ్‌లు, విక్రయాలను తక్షణమే నిలిపివేయాలని స్పష్టం చేసింది.మరోవైపు.. కొనుగోలుదారులకు సకాలంలో ఫ్లాట్లు అప్పగించకుండా, రిఫండ్ విషయంలో నిర్లక్ష్యం వహించిన పలు నిర్మాణ సంస్థలకు రెరా గట్టి హెచ్చరికలు జారీ చేసింది. దీని ప్రకారం, వాసవి రియల్టర్స్ ఎల్ఎల్పీ కొనుగోలుదారుడికి చెల్లించాల్సిన రూ.49 లక్షల 50 వేలపై ఏడాదికి 10.85 శాతం వడ్డీతో సహా తిరిగి చెల్లించాలి. అలాగే త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ రూ.41 లక్షల 85 వేలు, ఎస్‌వీఎం ఆదిత్య హోమ్స్ రూ.27 లక్షల 16 వేలు, భువన తేజ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ రూ.26 లక్షలు, ఆదిత్య స్క్వేర్స్ రూ.17 లక్షలు, బీవీఆర్ ఇన్‌ఫ్రా రూ.7 లక్షల చొప్పున కొనుగోలుదారులకు వడ్డీతో సహా వెనక్కి ఇవ్వాలని ఆదేశించింది.
అంతేకాకుండా.. మియాపూర్‌లోని 'అరైన్ ఎమరాల్డ్' ప్రాజెక్టులో ఫ్లాట్ నంబర్ 502ను కొనుగోలుదారుడికి తక్షణమే అప్పగించాలని 'అరైన్ ఇన్‌ఫ్రా' సంస్థను రెరా ఆదేశించింది. తాము జారీ చేసిన ఈ ఆదేశాలను నిర్లక్ష్యం చేసినా, ఉల్లంఘించినా రెరా చట్టంలోని సెక్షన్ 63 ప్రకారం అదనపు జరిమానాలు, కఠిన చర్యలు తప్పవని అథారిటీ స్పష్టం చేసింది. ఈ తాజా నిర్ణయాలతో నిర్మాణ సంస్థల జవాబుదారీతనం, కొనుగోలుదారుల హక్కుల పరిరక్షణపై తెలంగాణ రెరా మరోసారి తన కఠిన వైఖరిని చాటుకుంది.



తెలంగాణ ప్రస్తావన ఏది?

ముద్ర, హైదరాబాద్ :
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీని లక్ష్యంగా చేసుకుని సూటి ప్రశ్న సంధించారు. సోనియా గాంధీ గుండెల్లో తెలంగాణ ఉంటే, ఆమె రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ఆత్మకథలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రస్తావన ఎందుకు లేదని నిలదీశారు. 'తెలంగాణ ఇచ్చింది సోనియమ్మే' అని చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.
తెలంగాణ రాష్ట్రం సోనియా గాంధీ దయాభిక్ష కాదని, అది తెలంగాణ ప్రజల పోరాట ఫలితమని కేటీఆర్ స్పష్టం చేశారు. తాజాగా ఆయన ఎక్స్ వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు తెలంగాణ ఉద్యమ కాలం నాటి జ్ఞాపకాలను కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. ఉద్యమంలో భాగంగా 2011 నవంబర్ 16 నుంచి 21 వరకు తాను చేపట్టిన పాదయాత్రకు 15 ఏళ్లు పూర్తయినట్లు తెలిపారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్ పిలుపు మేరకు ఆరు రోజుల పాటు సాగిన ఆ పాదయాత్ర తనకు ఓ గొప్ప జ్ఞాపకమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఉద్యమ చరిత్రను ప్రస్తావిస్తూ, సోనియా గాంధీపై, కాంగ్రెస్‌పై ఆయన ఈ విమర్శలు చేసినట్లు స్పష్టమవుతోంది.

మందుబాబుల షాకింగ్ న్యూస్..

ముద్ర, హైదరాబాద్:
ఖరీదైన మద్యం తాగుతున్నామనే భ్రమలో ఉన్న మందుబాబులకు షాకింగ్ న్యూస్. ప్రముఖ విదేశీ మద్యం బ్రాండ్ల బాటిళ్లలో చీప్ లిక్కర్ నింపి అధిక ధరలకు విక్రయిస్తున్న అక్రమ దందా హైదరాబాద్‌లో వెలుగుచూసింది. కేవలం రూ.560 విలువ చేసే చీప్ లిక్కర్‌ను జానీ వాకర్, డ్యుయర్స్, 100 పైపర్స్ వంటి ప్రీమియం బ్రాండ్ల బాటిళ్లలో నింపి విక్రయిస్తున్న ముఠా గుట్టును గ్రేటర్ హైదరాబాద్ ఎక్సైజ్ డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ (DTF) అధికారులు రట్టు చేశారు. ఈ వ్యవహారంలో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. శంషాబాద్‌లోని శాతంరాయ్ ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో ఈ అక్రమ వ్యాపారం వెలుగులోకి వచ్చింది.
ఎక్సైజ్ అధికారుల వివరాల ప్రకారం.. ఈ వ్యవహారంలో వంగలి అశోక్ (43), మహమ్మద్ యాకూబ్ పాషా (29) కీలకంగా వ్యవహరించినట్లు గుర్తించారు. అశోక్ గతంలో బగ్గ డిస్టిలరీలో పనిచేసేవాడని.. సుమారు ఆరు నెలల క్రితం ఉద్యోగం మానేసిన అతడు క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తూనే ఇంట్లో అక్రమంగా మద్యం బాటిళ్లను రీఫిల్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఇందుకోసం యాకూబ్ పాషాకు చెందిన స్క్రాప్ దుకాణం నుంచి ఖాళీ ప్రీమియం మద్యం బాటిళ్లను సేకరించేవాడని తెలిపారు. వాటిని శుభ్రం చేసి తిరిగి వినియోగిస్తూ కల్తీ మద్యం విక్రయిస్తున్నట్లు వెల్లడైందన్నారు.
ఎక్సైజ్ కానిస్టేబుల్ ధనుంజయ్ అందించిన సమాచారంతో సీఐ నరేందర్ ఆధ్వర్యంలోని డీటీఎఫ్ బృందం శాతంరాయ్‌లోని అశోక్ నివాసంపై ఆకస్మికంగా దాడులు నిర్వహించింది. ఈ తనిఖీల్లో 10 కల్తీ మద్యం బాటిళ్లతో పాటు 30కి పైగా ఖాళీ ప్రీమియం బ్రాండ్ల బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఖాళీ బాటిళ్లను యాకూబ్ పాషా స్క్రాప్ దుకాణం నుంచి సేకరిస్తున్నట్లు అశోక్ వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. దీంతో యాకూబ్ పాషాను అరెస్టు చేశారు. ఈ ముఠా స్థానికంగా సుమారు 10 మందికి కల్తీ మద్యం విక్రయించినట్లు ఎక్సైజ్ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ మద్యం కొనుగోలు చేసిన వారిని గుర్తించి విచారించడంతో పాటు, అక్రమ దందా వెనుక ఉన్న సరఫరా నెట్‌వర్క్‌పై దర్యాప్తు చేపట్టనున్నారు. నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న మద్యాన్ని తదుపరి విచారణ నిమిత్తం షంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు గ్రేటర్ హైదరాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ్ భాస్కర్ గౌడ్ వెల్లడించారు. ఈ దందాను ఛేదించిన డీటీఎఫ్ బృందాన్ని డిప్యూటీ కమిషనర్ ఏ. శ్రీనివాస రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ్ భాస్కర్ గౌడ్ అభినందించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 18.11.2026
www.mudranews.in | @mudranews

టీతో జంతికలు తింటున్నారా?

సాయంత్రం టీతో వేడివేడి జంతికలు తినడం చాలామందికి ఇష్టం. కానీ జంతికలను అధిక నూనెలో వేయిస్తారు. వీటిని తరచూ టీతో కలిపి తీసుకోవడం వల్ల కొందరిలో ఎసిడిటీ, అజీర్తి, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు రావచ్చు. రోజువారీ అలవాటుగా మార్చుకోకపోవడమే మంచిది.



కేసీఆర్ దంపతులకు వివాహ ఆహ్వానం అందజేసిన పైళ్ల శేఖర్ రెడ్డి

భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఇంట పెళ్లి సందడి



ముద్ర, హైదరాబాద్ : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు దంపతులను భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. తన కుమార్తె మన్విితా రెడ్డి వివాహ వేడుక ఈ నెల 26న జరుగుతుందని.. హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ కేసీఆర్, శోభమ్మ దంపతులకు వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ దంపతులతో కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. కుటుంబంలో జరగనున్న శుభకార్యానికి రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. పైళ్ల శేఖర్ రెడ్డి అందించిన ఆహ్వాన పత్రికను కేసీఆర్ దంపతులు స్వీకరించారు. ఈ మర్యాదపూర్వక భేటీకి సంబంధించిన వివరాలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని కలిగించాయి. మాజీ ఎమ్మెల్యే తన కుమార్తె వివాహానికి పార్టీ అధినేతను స్వయంగా కలిసి ఆహ్వానించడం బీఆర్ఎస్ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు శ్రీమతి వనితారెడ్డి కుమారుడు శ్రేయస్ రెడ్డి పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూం తనిఖీల సమాచారం లీక్.. డీఈఈ సస్పెండ్

ముద్ర, హైదరాబాద్ : డబుల్ బెడ్ రూం ఇళ్లలో అసలైన లబ్ధిదారులే నివాసం ఉంటున్నారా లేదా అని నిర్ధారించేందుకు నిర్వహిస్తున్న ఆకస్మిక తనిఖీల సమాచారాన్ని ముందుగానే లబ్ధిదారులకు లీక్ చేసిన హౌసింగ్ కార్పొరేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ) చంద్రపాల్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. ఈ మేరకు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి. గౌతమ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొల్లూరులో కేటాయించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలో చాలామంది లబ్ధిదారులు నివాసం ఉండకుండా ఇతరులకు అద్దెకు ఇవ్వడం, విక్రయించడం వంటి ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. ఈ తనిఖీల సమాచారాన్ని చంద్రపాల్ ముందుగానే లీక్ చేసినట్లు విచారణలో నిర్ధారణ కావడంతో చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లక్ష్యానికి విరుద్ధంగా వ్యవహరించినా, విధుల్లో నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని అధికారులు స్పష్టం చేశారు.

తుఫాన్ నష్టానికి తక్షణ సాయం అందించండి

- సీఎం చంద్రబాబు

ముద్ర, న్యూఢిల్లీ : వరుసగా సంభవించిన ఆర్నబ్, మురసు తుఫాన్లతో రాష్ట్రానికి రూ.7 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని, తక్షణ ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. మంగళవారం ఢిల్లీలో ఆమెతో భేటీ అయిన సీఎం రాష్ట్రంలో తుఫాన్ల వల్ల పంటలు, విద్యుత్ వ్యవస్థ, తీర ప్రాంత మౌలిక వసతులకు జరిగిన నష్టాన్ని వివరించారు. అలాగే రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు నిధులు విడుదల చేయాలని, విశాఖ ఎకనమిక్ రీజియన్ అభివృద్ధికి అదనపు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ, అమరావతి, తిరుపతి ప్రాంతాల అభివృద్ధి ప్రణాళికలు, ఇటీవల నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు వివరాలను కేంద్ర మంత్రికి వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ఎంపీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- హరీశ్‌రావు



ముద్ర, సంగారెడ్డి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలంలో రైతులను కలిసిన ఆయన, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు పంటలను దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సన్న వడ్లకు బోనస్ ఇవ్వడం లేదని, దొడ్డు వడ్లను రూ.2,200కే కొనుగోలు చేస్తూ క్వింటాల్‌కు పది కిలోల తరుగు తీస్తున్నారని ఆరోపించారు. రైతులకు బోనస్‌పై జీవో విడుదల చేయడంతో పాటు, పంట నష్టపోయిన వారికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. యాసంగి రైతుబంధు నిధులు విడుదల చేయాలని, రైతు బీమా బకాయిలు చెల్లించి రైతు కుటుంబాలను ఆదుకోవాలన్నారు. మరోవైపు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, మిషన్ భగీరథ నీళ్లు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నల్లవాగు, నిజాంసాగర్‌లో అందుబాటులో ఉన్న నీటిని వినియోగించి తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ కూలీలకు ఇస్తామన్న రూ.12 వేల ఆర్థిక సాయం కూడా వెంటనే విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

కరువు వేళ గ్లోబల్ సమ్మిట్ అవసరమా?

ముద్ర, హైదరాబాద్ : రాష్ట్రంలో తీవ్ర ఎల్-నినో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'ను తక్షణమే వాయిదా వేయాలని 400 మందికి పైగా పౌర సమాజ నేతలు, మేధావులు సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో 365 మండలాలు కరువు బారిన పడగా, ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్న సమయంలో వేలాది మంది విదేశీ అతిథుల కోసం ఫైవ్‌స్టార్ ఏర్పాట్లు చేయడం ఏమిటని ప్రశ్నించారు. నీటి ఎద్దడితో పాఠశాలలు, హాస్టళ్లు మూతపడుతున్నా భారత్ ఫ్యూచర్ సిటీలో వేడుకలు నిర్వహించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కరువు సహాయక చర్యలను పక్కనపెట్టి ఐఏఎస్, ఉన్నతాధికారులను విదేశీ ప్రతినిధుల సేవలకు లైజన్ అధికారులుగా నియమించడం పరిపాలనా వైఫల్యమని విమర్శించారు. ప్రజాధనం, నీరు, విద్యుత్‌ను కరువు నివారణకు వినియోగించాలని కోరారు. ప్రొఫెసర్ శాంతా సిన్హా, ఆకునూరి మురళి, ఇ.ఎ.ఎస్. శర్మ తదితర ప్రముఖులు సంతకాలు చేసిన ఈ లేఖను తెలంగాణ పీపుల్స్ కోయలిషన్ తరఫున సీఎంకు పంపించారు. ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు.

ఇన్వెస్ట్ తెలంగాణ

- హైదరాబాద్‌ను దక్షిణాదిలో మరో వ్యాపార కేంద్రంగా మలచుకోండి: శ్రీధర్‌బాబు
- 189 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ.. 10.75 శాతం వృద్ధి
- డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026



ముద్ర, అహ్మదాబాద్ : గుజరాత్ పారిశ్రామికవేత్తలు తమ వ్యాపార కార్యకలాపాలను తెలంగాణకు విస్తరించి, హైదరాబాద్‌ను దక్షిణ భారతదేశంలో మరో ప్రధాన వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చేసుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, ఈవీ, ఏరోస్పేస్, రక్షణ, ఐటీ రంగాల్లో తెలంగాణలో విస్తృత పెట్టుబడి అవకాశాలున్నాయని తెలిపారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026 ప్రచారంలో భాగంగా ఫిక్కీ సహకారంతో అహ్మదాబాద్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. గుజరాత్ నుంచి పెట్టుబడులను తరలించడం తమ లక్ష్యం కాదని, అక్కడి పారిశ్రామికవేత్తలు వ్యాపారాలను మరింత విస్తరించుకునేందుకు తెలంగాణలో అవకాశాలు కల్పించడమే ఉద్దేశమని స్పష్టం చేశారు.

హైదరాబాద్ సమీపంలో 30 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ భవిష్యత్ పెట్టుబడులకు కీలక కేంద్రంగా నిలుస్తుందని చెప్పారు. డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, అధునాతన తయారీ, ఈవీ, ఇంధన నిల్వ, ఏఐ రంగాల కోసం ప్రత్యేకంగా భూములు కేటాయిస్తున్నట్లు వివరించారు.

తెలంగాణ ఆర్థిక వ్యవస్థ విలువ 189 బిలియన్ డాలర్లకు చేరిందని, గత ఏడాది 10.75 శాతం వృద్ధి నమోదైందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 2,000కు పైగా లైఫ్ సైన్సెస్ సంస్థలు, 500కు పైగా గ్లోబల్ కాపబిలిటీ సెంటర్లు ఉన్నాయని పేర్కొన్నారు.పెట్టుబడిదారులకు 100 శాతం స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్, ఏడేళ్ల వరకు 75 శాతం ఎస్‌జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ వంటి ప్రోత్సాహకా లు అందిస్తున్నట్లు వెల్లడించారు. టీజీ-ఐపాస్ ద్వారా భారీ పరిశ్రమలకు 15 రోజుల్లో అనుమతు లు మంజూరు చేస్తున్నామని, తెలంగాణలో పెట్టుబడులు పెట్టే ప్రతి గుజరాత్ కంపెనీకి ప్రత్యేక అధికారిని నియమి స్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వం లోని తెలంగాణ రైజింగ్–2047 విజన్‌లో భాగంగా CURE, PURE, RARE ప్రాంతాల ద్వారా సమగ్ర అభివృద్ధి చేపడుతున్నట్లు వివరించారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు.

గ్లోబల్ సమ్మిట్‌లో సుమారు 100 అంతర్జాతీయ ఏరోస్పేస్, రక్షణ సంస్థల భాగస్వామ్యంతో రక్షా ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ–2.0తో పాటు కీలక పారిశ్రామిక విధానాల ను ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. గుజరాత్, తెలం గాణ రాష్ట్రాలు పోటీ పడకుండా పరస్పర బలాలను ఉపయో గించుకుని దేశ ఆర్థికాభివృద్ధికి భాగస్వాములు కావాలని శ్రీధర్‌బాబు కోరారు.

స్వీట్లు, పాన్‌లో నకిలీ సిల్వర్ ఫాయిల్స్

ముద్ర, హైదరాబాద్ : హైదరాబాద్‌లో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న నకిలీ సిల్వర్ ఫాయిల్ తయారీ ముఠాల గుట్టును టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశా రు. స్వీట్లు, పాన్‌లు, బేకరీ ఉత్పత్తులపై ఆకర్ష ణీయంగా కనిపించే వెండి పూత వెనుక అసలైన వెండి కాకుండా ప్రమాదకర మైన అల్యూమినియం వాడుతున్నట్లు గుర్తిం చా రు. చార్మినార్, ఫలక్‌నుమా పరిసర ప్రాంతా ల్లో ఏకంగా నాలుగు అక్రమ తయారీ కేంద్రాలపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. కాజు బర్ఫీ మొదలుకొని చమ్ చమ్, స్వీట్ పాన్, కేకుల వరకు నకిలీ సిల్వర్ ఫాయిల్ వినియోగిస్తు న్నట్లు దర్యాప్తులో వెలుగుచూసింది. ఉత్తర ప్రదేశ్ సహా ఇతర రాష్ట్రాల నుంచి అల్యూమి నియం ముడిసరుకు తెప్పించి తెలంగాణ వ్యాప్తంగా స్వీట్ షాపులు, బేకరీలు, పాన్ షాపులకు సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ దాడుల్లో భారీగా నకిలీ ఫాయిల్స్, అల్యూ మినియం ఫ్లేక్స్ తయారీకి ఉపయో గించే యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

ఆయిల్ పామ్ రైతులకు ఆదాయ భాగస్వామ్యం 80:20 నిష్పత్తిలో అమలు చేయాలి

గెలల ధర టన్నుకు రూ.25 వేల కనీస గ్యారంటీ ధర నిర్ణయించాలి
మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి విజ్ఞప్తి చేసిన రైతులు
రైతుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన మంత్రి.. కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని హామీ

ముద్ర, హైదరాబాద్ : పెరుగుతున్న సాగు పెట్టుబడి ఖర్చులకు అనుగుణంగా ఆయిల్ పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులు–కంపెనీల మధ్య ఆదాయ పంపిణీ నిష్పత్తిని ప్రస్తుతమున్న 75:25 నుంచి 80:20కి మార్చాలని ఆయిల్ పామ్ రైతులు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ గెలలకు టన్నుకు రూ.25 వేల కనీస గ్యారంటీ ధర నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం సచివాలయంలో మంత్రిని కలిసిన రైతులు తమ సమస్యలు, డిమాండ్లను వివరించారు. 2025-26 ఆయిల్ ఇయర్ ముగియడంతో 2026-27 ఆయిల్ ఇయర్‌కు సంబంధించి గెలల ధర నిర్ణయించేందుకు కొత్త ఫార్ములాను రూపొందించాల్సిన నేపథ్యంలో తమ ప్రతిపాదనలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గత కొంతకాలంగా ఎరువుల ధరలు, కూలీల వేతనాలు, సాగుకు అవసరమైన ఇతర పెట్టుబడి ఖర్చులు గణనీయంగా పెరిగాయని రైతులు తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా దిగుబడులు తగ్గడంతో పాటు పెరుగుతున్న ఖర్చులు ఆయిల్ పామ్ సాగును భారంగా మారుస్తున్నాయని వివరించారు. రైతులకు తగిన ఆదాయం లభించేలా ధరల నిర్ణయ విధానంలో మార్పులు తీసుకురావాలని కోరారు.

ప్రస్తుతం అమల్లో ఉన్న సీఏసీపీ ఫార్ములాను కేంద్ర ప్రభుత్వం 2013లో రూపొందించిందని, అప్పటి నుంచి సాగు ఖర్చులు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఆదాయ భాగస్వామ్య నిష్పత్తిని 80:20కి సవరించాలని రైతులు సూచించారు. 20.01 శాతం ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో వద్ద 80:20 నిష్పత్తిని అమలు చేస్తే క్రూడ్ పామ్ ఆయిల్ మల్టిప్లయర్ 15.05 శాతం నుంచి 16.01 శాతానికి, పామ్ కెర్నల్ నట్ మల్టిప్లయర్ 7.59 శాతం నుంచి 8.06 శాతానికి పెరుగుతుందని వివరించారు. ఈ మార్పుతో ప్రతి టన్ను ఆయిల్ పామ్ గెలలపై రైతులకు సుమారు రూ.1,516 అదనపు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.

కేంద్రానికి లేఖ రాయాలని అధికారులకు ఆదేశం

రైతుల విజ్ఞప్తులపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సానుకూలంగా స్పందించారు. ఆదాయ పంపిణీ నిష్పత్తిని 80:20కి మార్చే అంశాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు వెంటనే కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శికి లేఖ రాయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శిని ఆదేశించారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ఆయిల్ పామ్ రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. పెరుగుతున్న సాగు ఖర్చులు, వాతావరణ పరిస్థితుల ప్రభావంతో రైతులు నష్టపోకుండా ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. తెలంగాణలో ఆయిల్ పామ్ సాగును మరింత ప్రోత్సహించడంతో పాటు రైతులకు న్యాయమైన ధర, స్థిరమైన ఆదాయం కల్పించేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌తో క్రీడా రంగంలో నూతన అధ్యాయం: మంత్రి వాకిటి శ్రీహరి



ముద్ర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అత్యుత్తమ స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026ను దేశంలోనే అత్యుత్తమంగా నిర్వహించి రాష్ట్ర క్రీడా సామర్థ్యాన్ని చాటిచెప్పాలని పిలుపునిచ్చారు.

హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రముఖ క్రీడాకారుల తో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఈ క్రీడా పోటీల నిర్వహణ కోసం ముఖ్యమంత్రి రూ.203.36 కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. ఈ నిధులతో తాత్కాలిక ఏర్పాట్లకే పరిమితం కాకుండా రాబోయే 15 నుంచి 20 ఏళ్ల అవసరాలకు ఉపయోగపడేలా అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేడియాలు, క్రీడా మైదానాలు, శిక్షణ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇన్వెస్ట్ తెలంగాణ ద్వారా క్రీడా రంగంలోకి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

దేశంలోని 28 రాష్ట్రాల నుంచి సుమారు 7 నుంచి 8 వేల మంది క్రీడాకారులు, కోచ్‌లు, సాంకేతిక నిపుణులు ఈ పోటీలకు హాజరుకానున్న నేపథ్యంలో వారికి అత్యుత్తమ వసతి, ఆహారం, రవాణా, ఇతర సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, నాణ్యత విషయంలో రాజీ పడే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రముఖ క్రీడాకారులను కూడా నిర్వహణలో భాగస్వాము లను చేస్తామని, ఒక్కో క్రీడా వేదిక పర్యవేక్షణ బాధ్యతలను వారికి అప్పగించే ఆలోచనలో ఉన్నట్లు వెల్లడించారు. గ్రామీణ, గురుకుల, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రత్యేక బస్సుల ద్వారా పోటీలను వీక్షించేందుకు తీసుకొచ్చి వారిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తామన్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ విజయవంతమైతే భవిష్యత్తులో రాష్ట్ర క్రీడా రంగానికి రూ.1,500 కోట్ల నుంచి రూ.2,000 కోట్ల వరకు నిధులు సాధించే దిశగా కృషి చేస్తామని మంత్రి తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభావంతులను గుర్తించి ఒలింపిక్స్ స్థాయికి తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు ప్రధాన వేదికగా నిలబెట్టేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు.

ఐపీఎల్ వేలానికి స్టార్ ప్లేయర్లు!

ట్రావిస్ హెడ్‌కు ఎస్ఆర్‌హెచ్ గుడ్‌బై!
కావ్య మారన్ సంచలన నిర్ణయం!
ఐపీఎల్ వేలానికి స్టార్ ప్లేయర్లు!
హైదరాబాద్ జట్టులో భారీ మార్పులు!
డిసెంబర్ 16న ఆటగాళ్ల మెగా పోరు!



ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందే సన్‌రైజర్స్ హైదరాబాద్ సంచలన నిర్ణయం తీసుకుంది. జట్టులో కీలక ఆటగాడిగా ఉన్న ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్ ట్రావిస్ హెడ్‌కు ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం గుడ్‌బై చెప్పింది. అతడితో పాటు కమిందు మెండిస్, జయదేవ్ ఉనద్కత్, జెరాల్డ్ కొయెట్జీ, దిల్షాన్ మధుశంక వంటి ఆటగాళ్లను కూడా విడుదల చేసింది. దీంతో వచ్చే సీజన్‌లో హైదరాబాద్ జట్టు కొత్త రూపుతో బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మరోవైపు ఐపీఎల్ 2027 వేలానికి పది ఫ్రాంచైజీలు సిద్ధమవుతున్నాయి. డిసెంబర్ 16న గోవాలో ఆటగాళ్ల వేలం జరగనుంది. ప్రస్తుతం సన్‌రైజర్స్ హైదరాబాద్ దగ్గర రూ.40.15 కోట్ల పర్స్ అందుబాటులో ఉంది. మొత్తం ఏడు ఆటగాళ్ల స్లాట్లు ఖాళీగా ఉండగా, అందులో మూడు విదేశీ ఆటగాళ్లకు కేటాయించవచ్చు. దీంతో వేలంలో ఎస్ఆర్‌హెచ్ ఎవరిని కొనుగోలు చేస్తుందనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

ఇక ఈసారి అత్యధికంగా లక్నో సూపర్ జెయింట్స్ రూ.47.45 కోట్లతో వేలంలోకి అడుగుపెడుతోంది. కోల్‌కతా నైట్ రైడర్స్ రూ.41.65 కోట్లు, హైదరాబాద్ రూ.40.15 కోట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ట్రావిస్ హెడ్ వంటి స్టార్ ఆటగాళ్లు వేలంలో అందుబాటులోకి రావడంతో ఫ్రాంచైజీల మధ్య పోటీ రసవత్తరంగా మారే అవకాశం ఉంది. మరి వేలంలో హైదరాబాద్ ఎలాంటి ఆటగాళ్లను ఎంపిక చేసుకుంటుందో చూడాలి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews

బుధవారం,
18 నవంబర్, 2026

4 వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

అందమైన ప్రపంచానికి పునాది మనిషి అంతరంగమే!

బయట కనిపించే అందం కాదు.. లోపల ఉండే నిజాయితీనే మనిషికి అసలైన అందం!



అసలైన అందం మనుషుల మంచితనం!

ఒక సమాజం అభివృద్ధి చెందిందని చెప్పుకోవడానికి విశాలమైన రహదారులు, ఆకాశహర్మ్యాలు, పరిశ్రమలు, సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక సౌకర్యాలు మాత్రమే ప్రమాణాలు కావు. ఆ సమాజంలో నివసించే మనుషుల ఆలోచనలు, ప్రవర్తనలు, నైతిక విలువలు కూడా అభివృద్ధి చెందాలి. వ్యాపారి తన లాభం కోసం నాణ్యతలేని వస్తువులను విక్రయించకూడదు. ఉద్యోగి తన బాధ్యతలను నిర్లక్ష్యం చేయకూడదు. వైద్యుడు రోగి బలహీనతను వ్యాపార అవకాశంగా చూడకూడదు. విద్యాసంస్థలు విద్యార్థుల భవిష్యత్తును కేవలం ఆదాయ వనరుగా భావించకూడదు. బలవంతులు బలహీనులను దోచుకోకూడదు. ఒకరి కష్టాన్ని మరొకరు తమ స్వార్థానికి ఉపయోగించుకోకూడదు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిజాయితీగా నిర్వహించినప్పుడే పరస్పర విశ్వాసం పెరుగుతుంది. ఇతరుల హక్కులను గౌరవించడం, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడం, బలహీనులకు న్యాయం చేయడం వంటి విలువలే సమాజానికి అందాన్ని తీసుకొస్తాయి.

దేశానికి అందం పాలకుల, ప్రజల నిజాయితీ!

ఒక దేశానికి గొప్ప రాజ్యాంగం ఉండవచ్చు. ఎన్నో చట్టాలు, న్యాయస్థానాలు, ప్రభుత్వ శాఖలు, సమర్థులైన అధికారులు ఉండవచ్చు. కానీ వాటిని నిర్వహించే వ్యక్తుల్లో నిజాయితీ, నిబద్ధత, న్యాయబద్ధత లేకపోతే ఆ వ్యవస్థల వల్ల ఆశించిన ఫలితాలు ఎలా వస్తాయి? ప్రజలకు సేవ చేయాల్సిన అధికారి తన పదవిని వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకోకూడదు. ప్రజల కోసం పనిచేయాల్సిన రాజకీయ నాయకుడు అధికారాన్ని తన సొంత ఆస్తిగా భావించకూడదు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులు పక్షపాతానికి తావివ్వకూడదు. న్యాయం అందించాల్సిన వ్యవస్థ డబ్బుకు, పలుకుబడికి లొంగకూడదు. అదే సమయంలో ప్రజలు కూడా తమకు అనుకూలంగా ఉన్నప్పుడే చట్టాలను గౌరవించి, తమకు ఇబ్బంది కలిగినప్పుడు వాటిని ఉల్లంఘించే ధోరణిని విడనాడాలి. చట్టం కొంతమందిని రక్షించడానికి, మరికొంతమందిని ఇబ్బంది పెట్టడానికి ఉన్న సాధనం కాదు. ప్రతి పౌరుడికి సమానమైన న్యాయం కల్పించడానికి ఉన్న వ్యవస్థ.

అంతరంగంలో మంచిగా ఉండాలి!

ఒక వ్యక్తి అందరితో ప్రేమగా మాట్లాడవచ్చు. సమాజంలో మంచి పేరు సంపాదించవచ్చు. ఇతరుల ముందు ఆదర్శవంతుడిగా కనిపించవచ్చు. కానీ అతని అంతరంగంలో స్వార్థం, కపటం, ఇతరులను మోసం చేయాలనే ఉద్దేశం ఉంటే అతని మంచితనం నిజమైనదేనా? బయట ప్రేమను చూపిస్తూ లోపల ద్వేషాన్ని పెంచుకోకూడదు. బయట గౌరవిస్తున్నట్లు నటిస్తూ లోపల అవమానించాలనే ఆలోచన ఉండకూడదు. నమ్మకాన్ని కల్పించి రహస్యంగా మోసం చేయకూడదు. ఎదుటివారి అమాయకత్వాన్ని ఉపయోగించుకోకూడదు.

ఇతరుల జీవితాలను దెబ్బతీసి మన జీవితాన్ని అందంగా నిర్మించుకోవాలనుకోవడం నిజమైన అభివృద్ధి కాదు. ఇతరులకు అన్యాయం చేసి సంపాదించిన సంపద, ఇతరుల కన్నీళ్లపై నిర్మించుకున్న పేరు, నమ్మకద్రోహంతో పొందిన విజయం మనిషికి నిజమైన గౌరవాన్ని ఇవ్వలేవు. మనిషి తన మాటలను మాత్రమే కాదు, తన ఆలోచనలను కూడా పరిశీలించుకోవాలి. ఎందుకంటే నిజమైన వ్యక్తిత్వం ఇతరుల ముందు ఎలా ప్రవర్తిస్తున్నామనే దానిలోనే కాదు, ఎవరూ చూడనప్పుడు మనం ఎలా ఉంటామనే దానిలో బయటపడుతుంది.

అందమైన ప్రపంచాన్ని ఎలా నిర్మించాలి?

అందమైన ప్రపంచం ఒక్కరోజులో నిర్మితమయ్యేది కాదు. అది ప్రతి వ్యక్తి ఆలోచనల్లో మొదలై, కుటుంబాల్లో పెరిగి, సమాజంలో విస్తరించి, దేశ నిర్మాణంలో ప్రతిబింబించాలి. వ్యక్తి స్థాయిలో ఆలోచనల్లో నిజాయితీ, మాటల్లో సత్యం, ప్రవర్తనలో ధర్మం, చేతల్లో న్యాయం ఉండాలి. కుటుంబ స్థాయిలో ప్రేమ, నమ్మకం, పరస్పర గౌరవం, బాధ్యత, స్వేచ్ఛకు విలువ ఉండాలి. సమాజ స్థాయిలో సమానత్వం, సహకారం, మానవత్వం, అహింస, ఇతరుల హక్కుల పట్ల గౌరవం ఉండాలి. పాలనా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, నిష్పక్షపాత ధోరణి, అవినీతి రహిత పరిపాలన ఉండాలి. ఇవి కేవలం పుస్తకాలలో చదివే ఆదర్శాలు కాకూడదు. మన రోజువారీ జీవితంలో విలువలుగా మారాలి.

తమను తాము ప్రశ్నించుకోవాలి!

మన ఆలోచనల్లో ఇతరులకు హాని కలిగించే స్వార్థం ఉందా? మన మాటలకు, చేతలకు పొంతన ఉందా? ఎదుటివారు మనల్ని నమ్మినప్పుడు ఆ నమ్మకాన్ని కాపాడుతున్నామా? మన కుటుంబ సభ్యుల హక్కులను, స్వేచ్ఛను గౌరవిస్తున్నామా? మన లాభం కోసం ఇతరులకు నష్టం కలిగిస్తున్నామా? మనకు అధికారం వస్తే దానిని బాధ్యతగా ఉపయోగిస్తున్నామా? ఎవరూ చూడనప్పుడు కూడా తప్పు చేయకుండా ఉండగలుగుతున్నామా? మన వల్ల మరొకరి జీవితం ప్రశాంతంగా ఉందా? లేక బాధగా మారుతోందా? ఈ ప్రశ్నలకు ప్రతి ఒక్కరూ తమ అంతరాత్మ ముందు నిజాయితీగా సమాధానం చెప్పుకోగలిగితే వ్యక్తిగత జీవితాల్లోనే కాదు, కుటుంబాల్లో, సమాజంలో కూడా అనేక సమస్యలు తగ్గుముఖం పడతాయి. ఇక్కడ మరో ముఖ్యమైన విషయాన్ని గుర్తుంచుకోవాలి. మంచితనం అంటే తప్పులను చూసీచూడనట్లు వదిలేయడం కాదు. తప్పు చేసినవారిని సరిదిద్దడానికి అవకాశం ఇవ్వాలి. కానీ తప్పును సమర్థించకూడదు. అన్యాయాన్ని సహించకూడదు. ఇతరులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించడానికి భయపడకూడదు. అదే సమయంలో తప్పు చేసిన వ్యక్తికి మార్పు చెందే అవకాశం కూడా కల్పించాలి.

మార్పు మనతోనే ప్రారంభం కావాలి!

ప్రపంచాన్ని మార్చాలని కోరుకునే ప్రతి ఒక్కరూ ముందుగా తమను తాము మార్చుకోవాలి. ఒక వ్యక్తి మంచిగా మారితే ఒక మంచి వ్యక్తి తయారవుతాడు. ఒక కుటుంబంలోని సభ్యులందరూ మంచితనంతో జీవిస్తే మంచి కుటుంబం ఏర్పడుతుంది. అలాంటి కుటుంబాలు పెరిగితే మంచి సమాజం నిర్మితమవుతుంది. మంచి సమాజం నుంచి నిజాయితీగల నాయకులు, బాధ్యతాయుతమైన అధికారులు, చట్టాలను గౌరవించే పౌరులు ఏర్పడితే మంచి దేశం ఆవిర్భవిస్తుంది. అలాంటి దేశాలు పెరిగితే అందమైన ప్రపంచం నిర్మితం అవుతుంది. మనిషి అంతర్గతంగా చెడిపోతే కుటుంబం చెడిపోతుంది. కుటుంబాలు చెడిపోతే సమాజం చెడిపోతుంది. సమాజం చెడిపోతే దేశం బలహీనపడుతుంది. దేశాలు చెడిపోతే శాంతి దెబ్బతింటుంది.

అదే విధంగా..

మనిషి అంతర్గతంగా అందంగా మారితే కుటుంబం అందంగా మారుతుంది. కుటుంబం అందంగా మారితే సమాజం అందంగా మారుతుంది. సమాజం అందంగా మారితే దేశం అందంగా మారుతుంది. దేశాలు అందంగా ఉంటే ప్రపంచం అందంగా ఉంటుంది. ప్రపంచానికి కావలసింది కేవలం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కాదు; మానవత్వంతో కూడిన విజ్ఞానం. సంపద మాత్రమే కాదు; సంతృప్తితో కూడిన జీవనం. అధికారం మాత్రమే కాదు; బాధ్యతతో కూడిన నాయకత్వం. అందమైన భవనాలు మాత్రమే కాదు; అందమైన మనసులు. ఎందుకంటే... ప్రపంచాన్ని అందంగా మార్చేది మనిషి ధరించే దుస్తులు కాదు, అతను కలిగి ఉన్న సంపద కాదు, అతని పదవులు, హోదాలు కాదు. అతని అంతరంగంలోని నిజాయితీ, మానవత్వం, మంచితనమే! అందమైన ప్రపంచానికి పునాది అందమైన మనిషి. అందమైన మనిషికి పునాది అతని అందమైన అంతరంగమే!

డాక్టర్ ఎస్. రాజారామ్
సెల్ : 7799910222



అహంకారం నిన్ను పతనానికి చేరుస్తుంది, వినయం నిన్ను ఉన్నతంగా నిలబెడుతుంది.
గెలిచినప్పుడు గర్వపడకు, ఓడినప్పుడు కృంగిపోకు.
సమస్యలు సహజం, వాటిని ఎదుర్కొనే ధైర్యం అవసరం.
ప్రతి సమస్య నీకు ఒక అవకాశాన్ని ఇస్తుంది.

ఆశతో ఉంటేనే జీవితం, ఆశ లేనిదే శూన్యం.
ప్రతి ఉదయం ఒక కొత్త ఆరంభం, కలలను సాకారం చేసుకో.
లక్ష్యం లేకుండా సాగే ప్రయాణం అంధకారం.
నీ జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకో.

ప్రతి మనిషి ఒక కథ, ప్రతి జీవితం ఒక కావ్యం.
నీ కథను నువ్వే రాయాలి, అందంగా మలచాలి.
గతాన్ని మార్చలేవు, భవిష్యత్తును సృష్టించగలవు.
వర్తమానాన్ని సద్వినియోగం చేసుకో.

నిజాయితీతో జీవించు, నిజమే నీకు బలమని నమ్ము.
మోసం తాత్కాలిక సంతోషాన్ని ఇస్తుంది, కానీ శాశ్వత ప్రశాంతతను దూరం చేస్తుంది.
సత్యమే నిన్ను నిలబెడుతుంది, నిందల నుండి కాపాడుతుంది.
నీ మనస్సాక్షికి విలువనివ్వు.

కోపం తగ్గించుకో, అది నీ మనసును తినేస్తుంది.
శాంతంగా జీవించు, ప్రశాంతంగా ఉండు.
క్షమించడం నేర్చుకో, నీ మనసుకు స్వేచ్ఛనివ్వు.
ద్వేషాన్ని కాదు, ప్రేమను పంచు.

గర్భస్థ శిశువుకు మానసిక వికాసానికి ముప్పు!

గర్భిణుల్లో విటమిన్-సీ లోపం



గర్భధారణ సమయంలో తల్లికి విటమిన్ – సి తగినంత అందకపోతే శిశువు మెదడు, మానసిక, భావోద్వేగ వికాసంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తాజా అధ్యయనం వెల్లడించింది. విటమిన్ – సి తక్కువగా తీసుకున్న తల్లుల పిల్లల్లో ఆరు నెలల వయసులోనే చిరాకు, అసహనం, ఆందోళన వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఇవి భవిష్యత్తులో మానసిక ఆరోగ్య సమస్యలకు ముందస్తు సూచనలు కావచ్చని తెలిపారు. ఒరెగాన్ హెల్త్ అండ్ సైన్స్ యూనివర్సిటీ పరిశోధకులు 300 మందికి పైగా గర్భిణుల పోషకాహారం, మానసిక ఆరోగ్య వివరాలను విశ్లేషించారు. డిప్రెషన్, ఆందోళన, ఒత్తిడి స్థాయిలతో పాటు ఆహారం, సప్లిమెంట్ల ద్వారా అందుతున్న విటమిన్ – సి పరిమాణాన్ని నమోదు చేశారు.

శిశువులకు ఆరు నెలల వయసు వచ్చిన తర్వాత వారి ప్రవర్తన, భావోద్వేగ స్వభావంపై సంరక్షకుల నుంచి వివరాలు సేకరించారు. గర్భధారణ సమయంలో తల్లుల్లో ఒత్తిడి పెరిగితే శిశువుల్లోనూ ప్రతికూల భావోద్వేగాలు అధికమవుతున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా గర్భధారణ సమయం లో విటమిన్ – సి సప్లిమెంట్లు తీసుకోవడం వల్ల తల్లి ఒత్తిడికి, శిశువుల్లో ప్రతికూల భావోద్వేగాలకు మధ్య ఉన్న సంబంధం తగ్గినట్లు అధ్యయనంలో వెల్లడైంది. ఆహారం ద్వారా లభించే విటమిన్–సీ కంటే సప్లి మెంట్ల ప్రభావం ఈ విషయంలో స్పష్టంగా కనిపించిందని పరిశోధకులు పేర్కొన్నారు. విటమిన్ – సీ లోని యాంటీఆక్సిడెంట్ లక్షణాలు, ఒత్తిడిని నియంత్రించే గుణాలు గర్భస్థ శిశువు మెదడు వికాసానికి తోడ్పడవచ్చని తెలిపారు. గర్భంలోని పోషక వాతావరణం శిశువు మెదడు అభివృద్ధితో పాటు భావోద్వేగాలు, ప్రవర్తనను ప్రభావితం చేస్తుందని పరిశోధన ప్రధాన రచయిత ఎలిజబెత్ వుడ్ పేర్కొన్నారు. ఈ అధ్యయనం 'డెవలప్‌మెంటల్ సైకాలజీ' జర్నల్‌లో ప్రచురితమైంది. అయితే వైద్యుల సలహా మేరకే గర్భిణులు విటమిన్ – సీ సప్లిమెంట్లు తీసుకోవాలని పరిశోధకులు సూచించారు.

రైస్ కుక్కర్ వంట మంచిదా?



మనకు వరి అన్నమే ప్రధానమైన ఆహారం. దేశంలోని చాలా ప్రాంతాల్లో వరి అన్నాన్ని ఆహారంగా తీసుకుంటారు. అయితే సాధారణ పద్ధతిలో కాకుండా ఇప్పుడు ఎక్కువగా ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్‌లో వంట చేస్తున్నారు. సులువైన పద్ధతి కావడంతో ఎక్కువ మంది ఈ పద్ధతినే ఫాలో అవుతున్నారు. అయితే ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్‌లో వండిన అన్నం ఆరోగ్యానికి మంచిది కాదనే వాదన ఈ మధ్య బలంగా వినిపిస్తున్నది. దీనివల్ల రకరకాల అనారోగ్య సమస్యలు వస్తాయని అంటున్నారు.

ప్రయోజనాలు..

రైస్ కుక్కర్‌లో వండిన అన్న బాగా ఉడకడం వల్ల సులువుగా జీర్ణమవుతుంది.
పైగా అన్నంలో ప్రోటీన్‌లు, పిండి పదార్థాలు, ఫైబర్ లాంటి స్థూల పోషకాలు ఉంటాయి.
పొయ్యి మీది మాదిరిగా రైస్ కుక్కర్‌లో అన్నం ఎగరకపోవడం వల్ల మెతుకులు ఇరగకుండా ఉంటాయి.
ఎక్కువ ప్రెషర్‌లో అన్నం వండటంవల్ల బియ్యంలో, నీళ్లలో ఉండే హానికర శిలీంధ్రాలు, బ్యాక్టీరియా నాశనమైపోతాయి.
పొయ్యి మీది వంటతో పోల్చితే ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్‌లో అన్నం వేగంగా సిద్ధమవుతుంది.

డిప్రెషన్‌కి, అప్‌సెట్ అవడానికి
తేడా ఉందా?

సోషల్ మీడియా మెంటల్ హెల్త్‌పై ప్రతికూల ప్రభావం చూపిస్తోందని సైకియాట్రిస్టులు వివరించారు. మనకు వచ్చే సమస్య ఏదైనా దానికి పరిష్కారమే లేదని ముందే ఓ నిర్ణయానికి వచ్చేస్తున్నారని, ఇలా అతిగా ఆలోచించడం వల్లే మానసిక సమస్యలు తలెత్తుతున్నాయని వారు చెప్తున్నారు. సమస్యల విషయంలోనూ లింగ వివక్ష చూపిస్తున్నారని వైద్యులు అభిప్రాయపడ్డారు. మహిళలు చాలా సెన్సిటివ్‌గా ఉంటారన్న ముద్ర వేశారని, కానీ ఎమోషన్స్ అందరికీ ఒకటే అని వివరించారు. ఓ సమస్య వచ్చినప్పుడు ఒక్కొక్కరూ ఒక్కోలా రియాక్ట్ అవుతారని, ఇందులో ఆడ, మగ అన్న తేడా చూడడం సరికాదని తెలిపారు.


రీల్స్ కారణంగా మహిళల మానసిక ఆరోగ్యంపైనే ఎక్కువగా ప్రభావం పడుతోందన్న వాదనను డాక్టర్ కొట్టి పారేశారు. మహిళలు ఎన్ని విజయాలు సాధించినా ఇంకా వాళ్లపై ఇలాంటి అభిప్రాయాలు రుద్దుతున్నారని అన్నారు. డిప్రెషన్‌కి, అప్‌సెట్‌కి చాలా తేడా ఉందని వివరించారు. ఓ పిజ్జా షాప్‌కి వెళ్లి ఎక్కువ సేపు వెయిట్ చేయాల్సి వస్తే ఆ సమయంలో అప్‌సెట్ అవుతాం తప్ప డిప్రెస్ అవ్వమని, ఈ తేడా తెలియక చాలా మంది ప్రతి దానికీ డిప్రెషన్ అనే పేరు పెడుతున్నారని వైద్యులు వివరించారు.

ఈ మధ్య కాలంలో సూసైడ్స్ ఎక్కువగా నమోదవుతున్నాయని తెలిపారు. నిజానికి గ్రామీణ ప్రాంతాల్లోనే ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. రైతుల్లో ఒత్తిడిని తగ్గించే ప్రయత్నం చేస్తే చాలా వరకూ ఆత్మహత్యల్ని అదుపు చేయొచ్చని వివరించారు. మెంటల్ హెల్త్ అనేది మనం తీసుకునే డైట్‌పైనా ఆధారపడి ఉంటుందని వెల్లడించారు. మనం సాధించింది చిన్న విజయమైనా మనల్ని మనం మెచ్చుకోవాలని, ఈ సెల్ఫ్ రివార్డింగ్ వల్ల మానసికంగా చాలా ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. ఓ ఎగ్జామ్ బాగా రాసినప్పుడు వెంటనే బయటకు వెళ్లి నచ్చిన ఫుడ్ తినాలని, నచ్చిన పని చేయాలని సూచించారు. మనకి మనం ఇలా ప్రియార్టీ ఇవ్వాలని తెలిపారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 18.11.2026
www.mudranews.in | @mudranews

సిగరెట్‌తో కూల్‌డ్రింక్ అస్సలు వద్దు



సిగరెట్ తాగుతూ కూల్‌డ్రింక్ తాగే అలవాటు ఆరోగ్యానికి మరింత హానికరం. సిగరెట్‌లోని నికోటిన్, కూల్‌డ్రింక్స్‌లోని అధిక చక్కెర కలిసి దంతాలు, చిగుళ్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. దీర్ఘకాలంలో ఊబకాయం, టైప్-2 మధుమేహం వంటి సమస్యల ముప్పు పెరుగుతుంది. ధూమపానానికి పూర్తిగా దూరంగా ఉండాలి.

అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందజేస్తాం

దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

ముద్ర, దేవరకొండ: కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని కెఎంఆర్ ఫంక్షన్ హాల్ లో 554 మందికి పెన్షన్లు వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, గీత నేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొత్తగా అర్హులైన అనేకమంది పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ వారికి తగిన న్యాయం జరగలేదని ఎమ్మెల్యే విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4 లక్షల 60 వేల పెన్షన్లు మంజూరు చేసి పేదలకు అండగా నిలుస్తోందని తెలిపారు. పెన్షన్ అనేది పేదలు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, నేత కార్మికులకు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని వారి జీవితాలకు ఒక భరోసా అని అన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన ప్రతి ఒక్కరికీ గౌరవప్రదమైన జీవనం కల్పించాలన్నదే రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి పెన్షన్లు మంజూరు చేయడం ద్వారా ప్రజా ప్రభుత్వం తన సంక్షేమ నిబద్ధతను చాటుకుంటోందని అన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పేదల సంక్షేమం, సామాజిక న్యాయం, ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే



స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ విజయేందర్ రెడ్డి, తహసిల్దార్ నరేందర్, ఎంపిడిఓ స్వర్ణలత, ఎంపిఓ సుధీర్ కుమార్, మండల రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్, పిఏసిఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్ రెడ్డి, మాజీ ఎంపిపిలు దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి, మేకల శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు, డిసిసి ప్రధాన కార్యదర్శిలు ఉట్కూరి వేమన్ రెడ్డి, మేకల రాజేందర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డుపల్లి సైదులు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఉపసర్పంచులు పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా

కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

ముద్ర, సూర్యాపేట, నవంబర్ 17:కుటుంబాన్ని పోషించే వ్యక్తి అకాల మరణంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనుంది. ఈ నెల 19 నుంచి డిసెంబర్ 20 వరకు ఈ పథకం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. జిల్లాలోని ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు.మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పథకం అమలు, దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.18 నుంచి 59 ఏళ్ల వారికి అర్హతకుటుంబాన్ని పోషించే వ్యక్తి బీమా పొందేందుకు అర్హుడని, 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు ఉండాలని కలెక్టర్ తెలిపారు. కుటుంబ పెద్ద మరణిస్తే నామినీకి రూ.5 లక్షల జీవిత బీమా పరిహారం అందుతుందని వివరించారు. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి కుటుంబం ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఉన్న కుటుంబాలు దరఖాస్తు చేసుకోవచ్చని, రేషన్ కార్డు లేని కుటుంబాలకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. వయసు ధ్రువీకరణకు ఆధార్ కార్డు సమర్పించాల్సి ఉంటుందన్నారు. కుటుంబ సభ్యుల్లో ఒకరి



కంటే ఎక్కువ మంది నామినీలను పేర్కొనే అవకాశం ఉంటుందని వివరించారు.దరఖాస్తుకు ఎలాంటి రుసుము లేదుఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఎలాంటి చార్జీలు, ఫీజులు లేదా ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కేవలం దరఖాస్తు చేసుకుంటే సరిపోతుందన్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలను దరఖాస్తుతో జతచేయాలని సూచించారు. ప్రత్యేకంగా ఫొటోలు, డిక్లరేషన్లు సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు.గ్రామ, వార్డు కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణఈ నెల 19 నుంచి జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాలు, మున్సిపల్ వార్డు కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేంద్రానికి ఒక ఇన్‌చార్జిని నియమించాలని, ఆన్‌లైన్‌లో నమోదైన వివరాలను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.రేషన్ కార్డు ఆధారంగా దరఖాస్తుల్లో ముందుగానే కొన్ని వివరాలు నమోదై ఉంటాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి కుటుంబ పోషకుడు, నామినీ వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని చెప్పారు. నామినీ మైనర్ అయిన సందర్భంలో బీమా పొందే వ్యక్తి సమ్మతించిన వారిని నామినీగా పేర్కొనవచ్చని తెలిపారు.దరఖాస్తు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలను మొబైల్ యాప్ లేదా వెబ్ పోర్టల్ ద్వారా అప్‌లోడ్ చేయాలని, హార్డ్ కాపీలను ఎంపీడీవో కార్యాలయాల్లో భద్రపరచాలని ఆదేశించారు.అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలిమూడు నుంచి నాలుగు క్లస్టర్లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించి గ్రామపంచాయతీల వారీగా పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఎంపీడీవోలు, ఎంఈవోలు, తహసీల్దార్లు, ఏఈపీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీవోలు పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించాలన్నారు.ప్రతి కుటుంబానికి పథకంపై అవగాహన కల్పించాలని, గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా ప్రచారం చేయించాలని ఆదేశించారు. నవంబర్ 19 నుంచి డిసెంబర్ 20లోగా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని, మండల ప్రత్యేక అధికారులు ప్రతిరోజూ స్వయంగా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో ఒకేసారి కార్యక్రమం ప్రారంభం కావాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, జడ్పీ సీఈఓ శిరీష, సీపీఓ కిషన్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, డీఎల్పీవో తదితరులు పాల్గొన్నారు.

నాటుసారాపై పోలీసుల మెరుపు దాడులు

రెండో రోజూ కొనసాగిన తనిఖీలు
9 పోలీస్ స్టేషన్ల పరిధిలో 14 కేసులు నమోదు..
43 లీటర్ల నాటుసారా స్వాధీనం
90 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం..
నాటుసారా తయారీదారులకు ఎస్పీ నరసింహ హెచ్చరిక
రూ.5 లక్షల పూచీకత్తుతో ఏడాది పాటు బైండోవర్ చేస్తాం

ముద్ర, సూర్యాపేట, నవంబర్ 17: జిల్లాలో నిషేధిత నాటుసారా తయారీ, విక్రయాలు, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు చేపట్టిన మెరుపు దాడులు రెండో రోజూ కొనసాగాయి. ఆదివారం ప్రారంభమైన ప్రత్యేక తనిఖీలను సోమవారం కూడా విస్తృతంగా నిర్వహించారు. తొమ్మిది పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాల్లో పోలీసులు ఏకకాలంలో ఆకస్మిక దాడులు చేపట్టారు.ఈ తనిఖీల్లో మొత్తం 14 కేసులు నమోదు చేసి 43 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 90 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. స్థానిక పోలీసు అధికారులు, ప్రత్యేక బృందాలు సమన్వయంతో ఈ దాడులు నిర్వహించాయి.తొమ్మిది పోలీస్ స్టేషన్ల పరిధిలో దాడులుమేళ్లచెరువు పోలీస్ స్టేషన్ పరిధిలోని హేమ్లా తండా, రామాపురంలో నాలుగు కేసులు నమోదు చేసి ఆరు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. 50 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. చింతలపాలెంలో నాలుగు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఒక కేసు నమోదు చేశారు.గరిడేపల్లి పరిధిలోని కుతుబ్‌షాపురం, కల్మలచెరువులో ఏడు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని



రెండు కేసులు నమోదు చేశారు. పది లీటర్ల పానకాన్ని ధ్వంసం చేశారు. పెన్‌పహాడ్ పరిధిలోని జల్లమలకుంట తండాలో ఐదు లీటర్లు, మోతె పరిధిలోని రాయిగుంట తండాలో రెండు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఒక్కో కేసు నమోదు చేశారు.మఠంపల్లి పరిధిలోని బిల్యానాయక్ తండా, బాడవ తండాల్లో పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని రెండు కేసులు నమోదు చేశారు. ఆత్మకూరు పరిధిలోని మంగల్కుండ, మంగల తండాల్లో మూడు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, మరో 30 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు.పాలకీడు పరిధిలోని సజ్జాపురంలో మూడు లీటర్లు, తిరుమలగిరి పరిధిలోని తోండ గ్రామంలో మూడు లీటర్ల నాటుసారాను



స్వాధీనం చేసుకుని ఒక్కో కేసు నమోదు చేశారు.నాటుసారా తయారీదారులపై కఠిన చర్యలునాటుసారా తయారీ, విక్రయాలు ప్రజల ఆరోగ్యానికి హానికరమని జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ పేర్కొన్నారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నాటుసారా కేసుల్లో పట్టుబడిన వారు తిరిగి నేరాలకు పాల్పడకుండా రూ.5 లక్షల పూచీకత్తుతో ఏడాది కాలానికి బైండోవర్ చేసే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.జిల్లాలో ఎక్కడైనా నాటుసారా తయారీ, విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. నాటుసారా రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.సమాచారాన్ని డయల్ 112 లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్లు 8712686026, 8712686057 కు తెలియజేయాలని సూచించారు.

విద్యార్థులకు పిపిటి ఛాలెంజ్ వ్యాస పోటీలు



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ జిల్లా స్థాయి పిపిటి ఛాలెంజ్ వ్యాస పోటీలు మంగళవారం ప్రభుత్వ ఐటిఐ లో నిర్వహించారు. సాంకేతికత, ఆవిష్కరణ, భవిష్యత్తు సంసిద్ధత సమ్మిళిత, బాధ్యతాయుతమైన వృద్ధిని నిర్ధారిస్తూ, అత్యాధునిక సాంకేతికతల తదుపరి తరంగానికి భారతదేశం ఎలా నాయకత్వం వహించగలదనే అంశం మీద పవర్ పాయింట్ ప్రసంటేషన్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల అధికారి కే. ధనంజనేయులు, కాలేజ్ ప్రిన్సిపాల్ లలిత, అధ్యాపకులు సుకృత్ రెడ్డి, పరమేశ్వర్, రామలింగయ్య, విజయలక్షి , విధ్యార్థిని , విధ్యార్థులు పాల్గొన్నారు.

జవాబుదారీ లక్ష్యంతో స.హా. చట్టంపై అవగాహన

అదనపు కలెక్టర్ నగేష్



ముద్ర ప్రతినిధి, మెదక్: ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకత , జవాబుదారీతనాన్ని మరింత పెంపొందించే లక్ష్యంతో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తున్నామని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లో సమాచార హక్కు చట్టం–2005పై మెదక్ జిల్లా స్థాయిలో పౌర సమాచార, సహాయ పౌర సమాచార అధికారులకు 2 రోజుల ప్రత్యేక శిక్షణను ఏర్పాటు చేశారు. మొదటిరోజు శిక్షణా కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ నగేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.సమాచార హక్కు చట్టం సామాన్య పౌరులకు ప్రభుత్వం అందించిన ఒక శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు కోరిన సమాచారాన్ని చట్ట నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా ఖచ్చితత్వంతో అందజేయాలని అధికారులకు సూచించారు.ఎటువంటి గోప్యతకు తావి వద్దని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంసిహెచ్ఆర్డీ శంకర్, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన పౌర సమాచార అధికారులు, సహాయ పౌర సమాచార అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజలకు పూర్తి వైద్య సేవలు అందించాలి

వైద్య, ఆరోగ్యశాఖ కమీషనర్ ముషర్రఫ్



ముద్ర ప్రతినిధి, మెదక్:ప్రజలకు 100 శాతం వైద్య సేవలు అందించాలనివైద్య, ఆరోగ్యశాఖ కమీషనర్ ముషర్రఫ్ అలీ ఫారుఖీ జిల్లా అధికారులు, సిబ్బందికి సూచించారు. మంగళవారం వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏ.ఎన్.సి నమోదు నుండి ఇమ్యూనైజేషన్ కార్యక్రమం వరకు ఆన్లైన్ రిపోర్ట్, ఆఫ్ లైన్ రిపోర్ట్ సమానంగా వుండాలని, తేడాలు వుండొద్దని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది ఆరోగ్యం పట్ల, వ్యాధుల పట్ల, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పట్ల పూర్తి అవగాహనతో వుండాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దని, ప్రతి నెల ఒక జిల్లాకు వచ్చి ఆ జిల్లా నుండే రాష్ట్ర సమీక్ష నిర్వహిస్తానన్నారు. భయపడకుండా విధులు నిర్వహించాలని, లక్ష్యాలలో వెనకబడవద్దని, 100 శాతం రిజల్ట్స్ ఇవ్వాలని కమీషనర్ తెలిపారు.తర్వాత అడ్వయిజరీ కమిటి సభ్యులతో గర్భ నిర్ధారణ నిషేధ చట్టంపై కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్, డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ. డా. సృజన, డా. హరిప్రసాద్, డా, అనిల్ కుమార్, పి.హెచ్.సి. వైద్యాధికారులు, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

రేపు మెదక్ లో జాబ్ మేళా



ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాల ఈనెల 19న మల్టీ నేషనల్ కంపెనీల ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వి. ఉమాదేవి తెలిపారు. ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీస్, విప్రో, కాగ్నిజెంట్, పీస్కాన్, అపోలో లాంటి కంపెనీల ఆధ్వర్యంలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నారు. మెదక్ చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు ఈ జాబ్ మేళాకు హాజరు కావాలని, టెన్త్ మేమో, ఆధార్ కార్డ్, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, డిగ్రీ పూర్తి చేసిన సర్టిఫికెట్స్ తీసుకొని స్టేడియం వద్ద గల తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల మహిళ నందు హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని మెదక్ చుట్టుపక్కల గ్రామాలలో ఉన్న డిగ్రీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే రోహిత్ చిత్రపటానికి పాలాభిషేకం



ముద్ర ప్రతినిధి, మెదక్:మెదక్ పట్టణం 32వ వార్డులో ప్రభుత్వం మంజూరు చేసిన చేయూత పింఛన్లు అర్హులైన 30 మందికి మంజూరైనట్లు స్థానిక కౌన్సిలర్ గోదల మానస సాయిరాం తెలిపారు. పింఛన్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు గోదల సాయిరాం, సల్మాన్, లబ్ధిదారులున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 18.11.2026
www.mudranews.in | @mudranews

వేడివేడి టీతో సిగరెట్ వద్దు!

టీ తాగుతూ సిగరెట్ కాల్చే అలవాటు చాలా ప్రమాదకరం. టీలోని కెఫిన్, సిగరెట్‌లోని నికోటిన్ మెదడును ప్రేరేపించి ధూమపానం చేయాలనే కోరికను పెంచవచ్చు. ముఖ్యంగా మరీ వేడిగా ఉండే టీ తాగడం, ధూమపానం చేయడం అన్నవాహిక ఆరోగ్యానికి హానికరం. ఈ అలవాటును వెంటనే మానుకోవడం మంచిది.



కార్పొరేట్ విధానాలతో వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం



ముద్ర, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలతో వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోతోందని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ విమర్శించారు. అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభల సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను ప్రైవేటీకరించే ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి వ్యయంపై 50 శాతం అదనంగా మద్దతు ధర ప్రకటించడంతో పాటు, ఎంఎస్‌పీకి చట్టబద్ధమైన హామీ కల్పించాలన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలపై కార్పొరేట్ కంపెనీల నియంత్రణ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో రైతు ఉద్యమాల ద్వారా రూ.32 వేల కోట్ల రుణమాఫీ సాధించామని, పలు రాష్ట్రాల్లోనూ పోరాటాలతో విజయాలు సాధించామని తెలిపారు. దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాల్లో ఏఐకేఎస్ విస్తరించిందని, 1.58 కోట్ల సభ్యత్వం ఉందన్నారు. తెలంగాణలో కౌలు రైతులు, భూమిలేని పేద రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కరువు పరిస్థితుల్లో తక్షణ సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వానికి ఇచ్చిన గడువు ముగిసిన తర్వాత రైతు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, నల్లగొండ, సూర్యాపేట నుంచి లక్ష మంది రైతులతో హైదరాబాద్‌కు లాంగ్‌మార్చ్ చేపట్టే ఆలోచన ఉందని వెల్లడించారు. రైతు, కార్మిక, ప్రజాసంఘాలతో కలిసి దేశవ్యాప్త ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు.

యాదాద్రి వెలుగులతో విద్యుత్ రంగానికి కొత్త బలం

రబీ సీజన్‌లో 4,000 మెగావాట్ల పూర్తి స్థాయి ఉత్పత్తికి TGGENCO కార్యాచరణ

ముద్ర, హైదరాబాద్ : తెలంగాణ విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పై ప్రత్యేక దృష్టి సారించింది. మొత్తం 4,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్ లో ఇప్పటికే నాలుగు యూనిట్లు వాణిజ్యపరంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తుండగా, ఐదో యూనిట్ డిసెంబర్ లో వాణిజ్య ఉత్పత్తికి సిద్ధమవుతోంది. దీంతో రానున్న రబీ సీజన్ లో ఐదు యూనిట్ల ద్వారా పూర్తి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి చేయాలని TGGENCO లక్ష్యంగా పెట్టుకుంది.ప్లాంట్ లో బొగ్గు సరఫరా వ్యవస్థకు సంబంధించిన సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తూ ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు. నైనీ బొగ్గు గనితో పాటు MCL, ECL సంస్థల నుంచి నిరంతర బొగ్గు సరఫరాకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే నైనీ నుంచి 4.26 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గును తరలించగా, ఇతర సంస్థల నుంచి కూడా సరఫరా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. బొగ్గు రవాణా మార్గాల మరమ్మతులు చేపట్టి ఉత్పత్తికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో అధికారులు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. నవంబర్ 11న రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి చరిత్రలో తొలిసారిగా 6,088 మెగావాట్ల గరిష్ఠ ఉత్పత్తి నమోదు కాగా, ఇందులో యాదాద్రి ప్లాంట్ 2,754 మెగావాట్ల విద్యుత్ అందించడం విశేషం. ఐదో యూనిట్ కూడా అందుబాటులోకి వస్తే రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడంలో యాదాద్రి కీలక పాత్ర పోషించనుంది. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ ను ఎదుర్కొంటూ తెలంగాణను విద్యుత్ ఉత్పత్తిలో మరింత స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడనుంది.

కోటి కుటుంబాలకు రూ.5 లక్షల బీమా..

ఇందిరమ్మ పథకానికి శ్రీకారం



ముద్ర, హైదరాబాద్: తెలంగాణలో కోటి కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ బీమా పథకాన్ని అమలు చేయనుంది. ఈ నెల 19న సిద్ధిపేటలో నిర్వహించే బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకానికి సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించనున్నారు. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న బీమా పథకాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి, అర్హులైన ప్రతి కుటుంబానికి భరోసా కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పథకం కింద ప్రస్తుతం అందుతున్న రూ.2 లక్షల జీవిత బీమా మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచనున్నారు. ఇప్పటికే అమల్లో ఉన్న ప్రమాద బీమా ప్రయోజనాలను యథాతథంగా కొనసాగించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ బీమా పథకాల ద్వారా ఇప్పటివరకు లబ్ధి పొందుతున్న వారిలో ఎవరూ నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గ్రామస్థాయిలోనే దరఖాస్తులు అందుబాటులో ఉంచి, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.మరోవైపు, రాష్ట్రంలోని అర్హులైన మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 19న సిద్ధిపేట సభలోనే చీరల పంపిణీ కార్యక్రమాన్ని కూడా సీఎం ప్రారంభించనున్నారు. చీరలను వెంటనే అన్ని జిల్లాలకు తరలించి పంపిణీకి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పంపిణీలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ రెండు పథకాల అమలుపై జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని వేగంగా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

ఆదివాసి హక్కులను కాలరాస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం

-ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్, మాజీ మంత్రి, త్రిపుర ప్రతిపక్ష నాయకుడు జితేంద్ర చౌదరి





ముద్ర, నల్లగొండ : నల్లగొండ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఆదివాసి గిరిజనులకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులన్నిటినీ కాలరాస్తోందని ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్, మాజీ మంత్రి, త్రిపుర ప్రతిపక్ష నాయకుడు జితేంద్ర చౌదరి తీవ్రంగా ఆరోపించారు. నల్లగొండ జీ యం కన్వెన్షన్ లో జరుగుతున్న అఖిల భారత కిసాన్ సభ 36వ మహాసభల్లో పాల్గొనడానికి వచ్చిన సందర్భంగా మహాసభ ప్రాంగణంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారత రాజ్యాంగంలో ఆదివాసి గిరిజనులకు కల్పించిన 1/70 చట్టం,పేసా చట్టాలను పూర్తిగా కాలరాస్తూ వేలాది ఎకరాల అటవీ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు అటవీ సంరక్షణ నియమాల చట్టం 2023 పేరుతో కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చిందని అన్నారు. తరతరాలుగా అడవులను నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసి గిరిజనులను ప్రాజెక్టులు ,అభివృద్ధి పేరుతో కోట్లాదిమందిని నిర్వాసితులుగా మార్చి బలవంతంగా వెళ్లగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సనాతన ధర్మం పేరుతో బిజెపి, ఆర్ఎస్ఎస్ వాటి అనుబంధ సంస్థలు గిరిజనుల సంస్కృతి, ఆచారాలు, ఆహార అలవాట్లపై తీవ్రమైన దాడి చేస్తూ ఆదివాసి గుర్తింపు తొలగించేందుకు తీవ్ర ప్రయత్నాలు మొదలుపెట్టిందన్నారు. వామపక్ష పార్టీలు, ఆదివాసీ గిరిజన, ప్రజా సంఘాలు పోరాడి సాధించుకున్న అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 ద్వారా దేశంలో ఆదివాసి గిరిజనులకు అటవీ భూములపై హక్కులు కల్పించాల్సి ఉండగా వారి భూములను బలవంతంగా లాక్కుంటున్నారని అన్నారు. వచ్చే నేల డిసెంబర్ 9,10 తేదీల్లో ఢిల్లీలో జరగబోయే ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ సమావేశాల్లో చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్ళు గడుస్తున్న గిరిజనులకు ఇచ్చిన హామీల్లో ఒక్క హామీలు కూడా అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో గిరిజనుల సాగులో ఉన్న ఏడు లక్షల ఎకరాల పోడు భూములకు హక్కులు ఇస్తామని హామీ ఇచ్చి ఒక్క ఎకరాకుపై కూడా హక్కులు కల్పించలేదని మండిపడ్డారు. గిరిజనులకు ఇచ్చిన హామీలపై కలిసి వచ్చే గిరిజన సంఘాలతో ఐక్య ఉద్యమాలను చేపడతామని తెలిపారు.

ఈ విలేకరుల సమావేశంలో ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ నాయకులు తమిళనాడు మాజీ ఎమ్మెల్యే ఢిల్లీ బాబు, రాజస్థాన్ నుండి ధూలి చంద్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మానాయక్, మధ్యప్రదేశ్ లోల్తా ప్రసాద్, ఝార్ఖండ్ నుండి ప్రఫుల్ లింగ్డా,మధ్యప్రదేశ్ నుండి రామ్ నారాయణ కురారియా, తమిళనాడు నుండి ఏ వి షణ్ముగం, సర్వరణ, పొన్ను స్వామి, కేంద్ర కమిటీ సభ్యులు భూక్య వీరభద్రం, నల్లగొండ జిల్లా కార్యదర్శి ఎర్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో వసూళ్లు



ముద్ర, కరీంనగర్ : కరీంనగర్ జిల్లాలోని కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగుల నుంచి వైద్య పరీక్షలు, చికిత్స పేరుతో వసూలు చేస్తున్న అధిక ఫీజులను సంబంధిత అధికారులు నియంత్రించాలని తెలంగాణ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.శివరాజ్ పేర్కొన్నారు. కరీంనగర్‌లో సోమవారం జరిగిన ఆ పార్టీ సమావేశంలో మాట్లాడారు. కొన్ని ఆసుపత్రుల్లో వైద్యం కోసం వస్తున్న వారికి అవసరం లేని పరీక్షలు నిర్వహించడం, లేని రోగాలను ఉన్నట్లు చెబుతూ భయాందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ఇలాంటి ఆసుపత్రులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వైద్య పరీక్షల ధరలు, వైద్య సేవల వివరాలను పరిశీలించాలని కోరారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం.మిరియా, జిల్లా అధ్యక్షుడు కె.అజయ్, బి.అంజయ్య, టి.వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఏరోస్పేస్ పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక కార్యాచరణ

స్థానికంగానే విమాన విడిభాగాల తయారీ, నిర్వహణకు అవసరమైన టూలింగ్ సదుపాయాలు
అధునాతన తయారీ, డిజైన్, ఇంజినీరింగ్ రంగాలకు ప్రోత్సాహం
జేఈహెచ్ ఏరోస్పేస్ 'టూలింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'
ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు
ప్రెసిషన్ ఇంజినీరింగ్‌కు కేంద్రంగా హైదరాబాద్



ముద్ర, హైదరాబాద్ : ప్రెసిషన్ ఇంజినీరింగ్, అధునాతన తయారీ రంగాలకు హైదరాబాద్‌ను కీలక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. విమాన విడిభాగాల తయారీతో పాటు వాటికి అవసరమైన టూలింగ్, అధునాతన యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్రంలోనే అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరులో జేఈహెచ్ ఏరోస్పేస్ సంస్థ ఏర్పాటు చేసిన 'టూలింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను మంగళవారం మంత్రి ప్రారంభించారు. విమానాలు, విమాన ఇంజిన్ల అసెంబ్లీ, మరమ్మతులు, నిర్వహణకు అవసరమైన ప్రత్యేక టూల్స్, ఫిక్చర్లు, గేజ్‌ల తయారీ లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్–2047 విజన్‌లో భాగంగా రాష్ట్రాన్ని అధునాతన తయారీ, ఏరోస్పేస్, రక్షణ, సాంకేతిక రంగాల్లో ప్రపంచస్థాయి పెట్టుబడులకు, పరిశ్రమలకు కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నామని చెప్పారు.

ఏరోస్పేస్ రంగంలో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా సమగ్ర పారిశ్రామిక వ్యవస్థను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. విడిభాగాల తయారీతో పాటు డిజైన్, ఇంజినీరింగ్, ప్రెసిషన్ మ్యానుఫ్యాక్చరింగ్, టెస్టింగ్ విభాగాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచస్థాయి సంస్థలు, దేశీయ పరిశ్రమలు, పరిశోధనా సంస్థలతో స్థానిక సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఈ) అనుసంధానించడంపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.విమానాలకు అవసరమైన ప్రత్యేక పరికరాలు, ఫిక్చర్లు, గేజ్‌ల కోసం ఇప్పటివరకు కొన్ని ప్రత్యేక సరఫరాదారులపైనే లేదా విదేశాలపైనే కంపెనీలు ఆధారపడాల్సి వచ్చేదని మంత్రి వివరించారు. ఇలాంటి అధునాతన టూలింగ్ సామర్థ్యాలు హైదరాబాద్‌లో అందుబాటులోకి రావడం రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఏరోస్పేస్ రంగం అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్‌కు మరింత గుర్తింపు తీసుకురావడంలో ఇలాంటి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీరపల్లి శంకర్, జేఈహెచ్ ఏరోస్పేస్ సీఈఓ విశాల్ సంఘావి, సీవీఓ వెంకటేష్ ముద్రగళ్ల తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ స్థాయికి తెలుగు సినీ పరిశ్రమ

ఇండియా జాయ్ 2026కు భారీ ఏర్పాట్లు
భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి 13 వరకు ఇండియా జాయ్ వేడుకలు
సినీ, యానిమేషన్, వీఎఫ్ఎక్స్, గేమింగ్ రంగాలకు అంతర్జాతీయ వేదిక



ముద్ర, హైదరాబాద్ : తెలంగాణలో సినీ, మీడియా, వినోద రంగాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఇండియా జాయ్–2026కు సన్నాహాలు ముమ్మరమయ్యాయి. ఈ నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ప్రభుత్వం ఇండియా జాయ్–ఫిల్మ్ సెక్టార్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించింది. డిసెంబర్ 7 నుంచి 13 వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026లో భాగంగా ఇండియా జాయ్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో తెలుగు సినీ పరిశ్రమ ప్రముఖులు, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ రంగాల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

గ్లోబల్ స్థాయికి హైదరాబాద్ సృజనాత్మక రంగం

ఈ సందర్భంగా ఐటీఈ అండ్ సీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. ఆరెంజ్ ఎకానమీని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు హైదరాబాద్‌కు అనుకూలమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సినీ, సృజనాత్మక పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఏవీజీసీ పాలసీ, ఇమేజ్ టవర్స్ అభివృద్ధి, ఇప్పటికే ఉన్న సృజనాత్మక పరిశ్రమలకు అందిస్తున్న సహకారాన్ని వివరించారు. ఇండియా జాయ్–2026 ద్వారా ప్రభుత్వం రూపొందించిన విస్తృత ప్రణాళికను సమావేశంలో వివరించారు.

పరిశ్రమ భాగస్వామ్యానికి సినీ ప్రముఖుల హామీ

తెలుగు సినీ పరిశ్రమ ప్రతినిధులు ప్రభుత్వ చొరవను స్వాగతిస్తూ ఇండియా జాయ్–2026 విజయవంతానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు మాట్లాడుతూ.. తెలుగు సినీ పరిశ్రమను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అభినందించారు. సమ్మిట్ విజయవంతానికి యావత్ సినీ పరిశ్రమ భాగస్వామిగా నిలిచి పెద్ద ఎత్తున సహకరిస్తుందని తెలిపారు. ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు డి. సురేష్ బాబు మాట్లాడుతూ.. సినీ, సృజనాత్మక రంగాల ప్రయోజనాల కోసం ప్రభుత్వం నిరంతరం చేస్తున్న కృషి స్వాగతించదగినదని పేర్కొన్నారు.

ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ అధ్యక్షుడు సి. కల్యాణ్, డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) ఉపాధ్యక్షుడు డాక్టర్ మాదాల రవి తదితరులు సమావేశంలో పాల్గొని ఇండియా జాయ్‌కు మద్దతు తెలిపారు. దర్శకుడు హరీశ్ శంకర్, సాయి రాజేష్, నటుడు–దర్శకుడు రాహుల్ రవీంద్ర కూడా హాజరయ్యారు.

ఏవీజీసీ, వీఎఫ్ఎక్స్, గేమింగ్ రంగాలకు ప్రోత్సాహం

యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ పరిశ్రమలకు చెందిన ప్రముఖులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. సినీ నిర్మాణంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పరిశ్రమ అభివృద్ధి, ఈ రంగాలకు ప్రభుత్వం అందించాల్సిన ప్రోత్సాహంపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఫైర్‌ఫ్లై సంస్థకు చెందిన సనత్, ఫాంటమ్‌కు చెందిన బాసిరెడ్డి సునీల్ తదితరులు పాల్గొన్నారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ వ్యూహాత్మక సలహాదారు అచల్ మల్హోత్రా మాట్లాడుతూ.. ఇండియా జాయ్–2026ను గతంతో పోలిస్తే పదిరెట్ల విస్తృత స్థాయిలో నిర్వహించాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ సృజనాత్మక ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ పెట్టుబడిదారులు, స్టూడియోలతో అనుసంధానించే వేదికగా ఇండియా జాయ్ నిలుస్తుందని చెప్పారు. ఆర్ఆర్ఆర్ వంటి విజయవంతమైన చిత్రాలతో ప్రపంచ దృష్టిని ఆకర్షించిన హైదరాబాద్, ఇప్పుడు మరింత పెద్ద లక్ష్యాలతో ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొంటూ సినీ పరిశ్రమ భాగస్వామ్యం కావాలని ఆహ్వానించారు.

లక్ష మందికి పైగా సందర్శకులు.. 200కు పైగా ఎగ్జిబిటర్లు

తెలంగాణ ప్రభుత్వ మీడియా, వినోద రంగాల ప్రధాన కార్యక్రమమైన ఇండియా జాయ్‌లో సినిమాలు, ఏవీజీసీ–ఎక్స్‌ఆర్, కచేరీలు, గేమింగ్, ప్రముఖులు, డిజిటల్ ఇన్‌ఫ్లుయెన్సర్లకు సంబంధించిన విభాగాలు ఉండనున్నాయి. సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.సమావేశంలో ఐటీఈ అండ్ సీ శాఖ, తెలంగాణ ప్రభుత్వా అధికారులు కూడా పాల్గొన్నారు. ఇండియా జాయ్–2026 ద్వారా తెలంగాణను అంతర్జాతీయ మీడియా, వినోద, సృజనాత్మక పరిశ్రమల కేంద్రంగా నిలబెట్టేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 18.11.2026
www.mudranews.in | @mudranews

పప్పన్నంతో చిప్స్ తినడం మానేయండి!



పప్పన్నం, సాంబారు అన్నంతో పాటు చిప్స్ తినే అలవాటు ఉంటే తగ్గించుకోండి. ప్యాకెట్ చిప్స్‌లో ఉప్పు, కొవ్వులు అధికంగా ఉంటాయి. వీటిని భోజనంతో కలిపి తినడం వల్ల సోడియం, క్యాలరీల మోతాదు పెరుగుతుంది. రక్తపోటు, గుండె జబ్బుల ముప్పు పెరిగే అవకాశం ఉంది. చిప్స్‌కు బదులుగా తక్కువ ఉప్పుతో చేసిన అప్పడాలు తీసుకోవచ్చు.

ఆకట్టుకున్న దీపోత్సవం



మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయలలో కార్తీకమాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం దీపోత్సవం, ఆకాశ దీపారాధన చేశారు. కార్తీక మాసం శివ కేశవులకు ప్రీతీకరం. అర్చకులు పార్థీవ శర్మ చేసిన శంఖు చక్ర పుష్పాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. దుర్గమ్మ, శివకేశవ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. - ముద్ర ప్రతినిధి, మెదక్

పకడ్బందీగా ఇందిరమ్మ బీమా పథకం అమలు

గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల వారీగా ప్రత్యేక శిబిరాలు
19 నుంచి డిసెంబర్ 18 వరకు నమోదు ప్రక్రియ
అదనపు కలెక్టర్ నగేష్



ముద్ర ప్రతినిధి, మెదక్: ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా జిల్లాలోని అర్హులైన ప్రతి కుటుంబాన్ని గుర్తించి, ఎవరూ మిగిలిపోకుండా బీమా నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు.మంగళవారం కలెక్టరేట్ లో ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి ఎంపీడీవో కార్యాలయ టెక్నికల్ సిబ్బందికి ఆన్లైన్ ఎంట్రీస్ పై ఈడిఎం సందీప్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సుదీర్ఘంగా వివరించారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ...ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించనున్నట్లు వెల్లడించారు. ప్రతి కుటుంబం నుంచి 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు కలిగిన ఒకరికి మాత్రమే బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీ ఆధారంగా అర్హత నిర్ణయించనున్నట్లు తెలిపారు. 1967 నవంబర్ 19 నుంచి 2008 నవంబర్ 18 మధ్య జన్మించిన వారు ఈ పథకానికి అర్హులని వివరించారు.ఈ నెల 19వ తేదీ నుంచి డిసెంబర్ 18వ తేదీ వరకు ఈనాలుగు వారాల పాటు గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల వారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, నమోదు ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందన్నారు.జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారన్నారు.నవంబర్ 19 నుంచి డిసెంబర్ 18 వరకు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌లో 9490389880 హెల్ప్‌లైన్‌తో కూడిన పర్యవేక్షణ కేంద్రం పనిచేస్తుందని తెలిపారు.జిల్లాలోని 21 మండలాల పరిధిలో ఉన్న 490 గ్రామ పంచాయతీలతో పాటు మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీల పరిధిలోని ప్రతి వార్డులో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు, ఆదివారాలతో సహా శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రేషన్ కార్డు నంబరునే దరఖాస్తు నంబరుగా పరిగణిస్తారన్నారు. రేషన్ కార్డు లేని కుటుంబాలకు ప్రభుత్వం నిర్దేశించిన కోడ్ ఆధారంగా ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించి నమోదు చేయనున్నారన్నారు.రేషన్ కార్డులో ఈ-కేవైసీ పెండింగ్‌లో ఉన్న కుటుంబాలు సంబంధిత రేషన్ షాపులో ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు.

పేదల కళ్లలో ఆనందం.. ప్రజాప్రభుత్వ సంక్షేమం

ఎమ్మెల్యే డా. రోహిత్
మెదక్ నియోజకవర్గంలో చేయూత పింఛన్ల పంపిణీ



ముద్ర ప్రతినిధి, మెదక్: పేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ప్రజాప్రభుత్వం "చేయూత" పింఛన్ల కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ రావు అన్నారు.మంగళవారం మెదక్, రామాయంపేట పట్టణాలతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలలో అర్హులైన పేదలకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమాలలో పాల్గొన్నారు. నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల పత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ. పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పింఛన్లు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా నిరుపేద కుటుంబాలకు ఆత్మగౌరవంతో జీవించేందుకు తోడ్పడే భరోసా అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ చైర్ పర్సన్లు కానుగు రాధిక భూపతిరాజ్, లావణ్య నాగరాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగాధర్, భూపతిరాజ్, మున్సిపల్ కౌన్సిలర్లు, హవేలీ ఘనపూర్ లో జిల్లా కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు పరశురామ్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, మండల పార్టీ నాయకులు బాలకిషన్ రావు, శేరి మహేందర్ రెడ్డి, చిట్యాల శ్రీనివాస్, నాగిరెడ్డి, మండల సర్పంచులు సాయిలు,, ఆయా మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్ష నిర్ణయాలతో ఇంటర్ బోర్డు రద్దు చేస్తామంటే ఒప్పుకోం

విద్యావేత్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులతో విస్తృత చర్చ జరపాలి
డ్రాప్‌అవుట్లకు ఆర్థిక ఇబ్బందులే ప్రధాన కారణం
గుజరాత్ తరహా పథకాలు అమలు చేయాలి
ఇంటర్ బోర్డు రద్దును దశలవారీగా చేపట్టాలి
తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



ముద్ర, హైదరాబాద్, నవంబర్ 17: తెలంగాణలో ఇంటర్మీడియట్ బోర్డు రద్దు విషయంలో ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే అంగీకరించబోమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. విద్యావ్యవస్థలో కీలక మార్పులు చేపట్టే ముందు విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలతో విస్తృతంగా చర్చించాలని డిమాండ్ చేశారు.సోమాజిగూడలో నిర్వహించిన 'ఇంటర్ బోర్డు రద్దు – తెలంగాణ విద్యపై ప్రభావం' అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న విద్యావ్యవస్థలో మార్పులు తీసుకొచ్చేటప్పుడు అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రభుత్వానికి అభిప్రాయాలు చెప్పేందుకు వెళ్లిన వారిపై ఎదురుదాడి చేసే పరిస్థితి ఉందని విమర్శించారు. అందుకే విద్యావేత్తలు, మేధావుల అభిప్రాయాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.డ్రాప్‌అవుట్లపై ప్రభుత్వ లెక్కలు సరికావుఇంటర్ బోర్డు రద్దుకు డ్రాప్‌అవుట్లే ప్రధాన కారణమని ముఖ్యమంత్రి చెబుతున్న గణాంకాలు సరైనవి కావని కవిత అన్నారు. మొత్తంగా డ్రాప్‌అవుట్ల శాతం 16 శాతంగానే ఉందని పేర్కొన్నారు. పదో తరగతి తర్వాత ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్ విద్యాసంస్థల్లోనో, ఇతర కోర్సుల్లోనో చేరుతున్న విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.విద్యార్థులు చదువు కొనసాగించలేకపోతే అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు, గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాల కొరత తదితర కారణాలతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని చెప్పారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థుల్లో డ్రాప్‌అవుట్లు ఎక్కువగా ఉంటున్నాయని పేర్కొన్నారు.గుజరాత్ తరహా పథకం తెలంగాణలోనూ అమలు చేయాలిగుజరాత్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'నమో లక్షి ' పథకాన్ని కవిత ప్రస్తావించారు. ఈ పథకం ద్వారా విద్యార్థుల ఖాతాల్లోకి ఏటా రూ.928 కోట్లు జమ చేస్తున్నారని, ఫలితంగా డ్రాప్‌అవుట్లు 16 శాతం తగ్గాయని తెలిపారు. తెలంగాణలోనూ ఇలాంటి పథకాన్ని అమలు చేస్తే పేద విద్యార్థులు చదువుకు దూరం కాకుండా చూడవచ్చని సూచించారు.బాలుర విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలిపదో తరగతి నుంచి ఇంటర్మీడియట్‌కు వెళ్లే బాలికల సంఖ్య తక్కువగా ఉందన్న ముఖ్యమంత్రి వ్యాఖ్యలను కవిత తప్పుబట్టారు. తన వద్ద ఉన్న గణాంకాల ప్రకారం బాలికల ప్రవేశాల శాతం 77.4 కాగా, బాలుర శాతం 68.4గా ఉందన్నారు. కాబట్టి బాలుర విద్యపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాలని సూచించారు. బాలురలో 51 శాతం మంది పరీక్షల్లో విఫలమవుతున్నారని, గంజాయి వినియోగం, చదువుపై నిర్లక్ష్యం వంటి అంశాలు ఇందుకు కారణమవుతున్నాయని పేర్కొన్నారు.పరిపాలనా మార్పులే విద్యా సంస్కరణలు కావుప్రభుత్వం పరిపాలనా సంస్కరణలను విద్యా సంస్కరణలుగా భావించకూడదని కవిత హితవు పలికారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు డ్రాప్‌అవుట్లు లేకుండా విద్యను కొనసాగించే విషయంలో తెలంగాణ టాప్-5లో ఉన్నప్పటికీ, నాణ్యమైన విద్యలో 28వ స్థానంలో ఉందని తెలిపారు. కేవలం వ్యవస్థాగత మార్పులతో విద్యా ప్రమాణాలు పెరగవని అభిప్రాయపడ్డారు.ఇంటర్ బోర్డు రద్దు నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకించడం లేదని, అయితే దాని అమలుకు మూడు నుంచి పదేళ్ల వరకు సమయం తీసుకుని దశలవారీగా ముందుకు వెళ్లాలని సూచించారు. అవసరమైన ఆర్థిక, విధానపరమైన మద్దతును ప్రభుత్వం అందించాలని కోరారు. అన్ని వర్గాలతో చర్చించి ఏకాభిప్రాయం సాధించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని, ఏకపక్షంగా ఇంటర్ బోర్డును రద్దు చేస్తామంటే మాత్రం అంగీకరించబోమని కవిత స్పష్టం చేశారు.

ఆరోగ్యశాఖలో ఇక నిర్లక్ష్యానికి తావులేదు!

పీహెచ్‌సీల పనితీరుపై రోజువారీ సమీక్ష..
నవంబర్ 30 వరకు ప్రత్యేక పర్యవేక్షణ
ప్రతి అధికారి ఐదు ప్రాధాన్యతా అంశాలపై దృష్టి పెట్టాలి
పనితీరు మెరుగుపడకుంటే మారుమూల ప్రాంతాలకు బదిలీ..
అవసరమైతే శాఖ వెలుపలికి పంపిస్తాం:
కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

ముద్ర, సూర్యాపేట, నవంబర్ 17: ఆరోగ్యశాఖలో నిర్లక్ష్యానికి ఇకపై తావులేదని, ప్రభుత్వ వైద్య సేవలను మెరుగుపరిచేందుకు అధికారులు సమష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. వ్యక్తులపై ఆధారపడకుండా వ్యవస్థాగత మార్పులతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు.



నవంబర్ 30 వరకు ప్రతిరోజూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) పనితీరుపై పది నిమిషాల పాటు సమీక్ష నిర్వహిస్తానని ప్రకటించారు.ఐదు అంశాలపై ప్రత్యేక దృష్టిప్రతి అధికారి తన పరిధిలోని కార్యక్రమాలు, బాధ్యతలు, పర్యవేక్షించాల్సిన అంశాలను జాబితా చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వాటిలో అత్యంత కీలకమైన ఐదు అంశాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేయాలన్నారు. మొత్తం పనుల్లో 80 శాతం పురోగతి సాధించేలా ఈ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు.పెండింగ్ పనులు, అత్యవసర అంశాలు, పూర్తిచేసిన కార్యక్రమాల వివరాలను నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ప్రతి అధికారి తన పనుల పురోగతిని ఒక పేజీలో రాసుకుని సమీక్షకు రావాలని, ఏ పని పూర్తయింది? ఏది పెండింగ్‌లో ఉంది? ఎంత శాతం పురోగతి సాధించారు? అనే వివరాలను స్పష్టంగా వివరించాలని సూచించారు. సమీక్షలకు హాజరుకాకపోవడాన్ని సహించేది లేదని హెచ్చరించారు.ఫైళ్ల నిర్వహణలో జాప్యం వద్దుడీఎంహెచ్‌వో కార్యాలయంలో ఫైళ్ల సర్క్యులేషన్, పరిపాలనా విధానాలు పక్కాగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. నిబంధనల ప్రకారం ఫైళ్ల నిర్వహణ జరగాలని, కార్యాలయ విధానాలు, క్యాడర్ నిర్వహణలో లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. పాత కారణాలు చెబుతూ పనులు ఆలస్యం చేయడాన్ని ఇకపై అంగీకరించబోమన్నారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరగాలిప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, లేబర్ రూముల ఆధునీకరణ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా వైద్య సేవల్లో గణనీయమైన మార్పులు తీసుకురావాలని సూచించారు.దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణలో ఆరోగ్యశాఖతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ఏ స్థాయిలో సమస్య ఉంటే అదే స్థాయిలో పరిష్కరించుకోవాలని, ప్రతి చిన్న విషయాన్ని జిల్లా కలెక్టర్ లేదా డీఎంహెచ్‌వో స్థాయికి తీసుకురావడం సరైన పద్ధతి కాదన్నారు.పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవుఅధికారులు కార్యాలయంలో ఉన్నంతసేపు ఇతర విషయాలను పక్కనపెట్టి విధులపైనే దృష్టి సారించాలని కలెక్టర్ హెచ్చరించారు. సానుకూల దృక్పథంతో పనిచేస్తూ ఆరోగ్యశాఖలో మార్పునకు ప్రతి ఒక్కరూ ముందుండాలన్నారు. పనితీరు మెరుగుపరచుకోని వారిని మారుమూల ప్రాంతాలకు బదిలీ చేయడంతో పాటు, అవసరమైతే శాఖ వెలుపలికి పంపించే పరిస్థితి వస్తుందని స్పష్టం చేశారు. పాత విషయాలను పక్కనపెట్టి నేటి నుంచే పద్ధతి ప్రకారం పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో కోటిరత్నం, డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లాంకో చెరువు సుందరీకరణకు చర్యలు..

ఇగురు హోటల్ రోడ్డు విస్తరణకు హామీ
సాయి వైభవ్, సాయి ఐశ్వర్య కాలనీల్లో పార్కులు, రోడ్ల అభివృద్ధికి వినతి
సానుకూలంగా స్పందించిన సైబరాబాద్ జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలంపటి



ముద్ర, శేరిలింగంపల్లి, నవంబర్ 17: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని లాంకో చెరువు సుందరీకరణ, చిత్రపురి మెయిన్ కమాన్ నుంచి ఇగురు హోటల్ వరకు రహదారి విస్తరణ, కాలనీల్లో పార్కులు, రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆధ్వర్యంలో స్థానిక కాలనీ ప్రతినిధులు అధికారులను కోరారు.ఈ మేరకు సైబరాబాద్ జోనల్ కమిషనర్ శ్రీ నారాయణ్ అమిత్ మాలంపటి ఐఏఎస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సాయి వైభవ్ కాలనీ అధ్యక్షురాలు పద్మ, సాయి ఐశ్వర్య కాలనీ అధ్యక్షుడు చౌదరి, చిత్రపురి కాలనీ ప్రతినిధి అనిల్ కుమార్ వల్లభనేని తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ట్రాఫిక్ సమస్యకు పరిష్కారంగా రోడ్డు విస్తరణచిత్రపురి మెయిన్ కమాన్ నుంచి ఇగురు హోటల్ వరకు ఉన్న రహదారిపై నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని ప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారిని త్వరితగతిన విస్తరించాలని కోరారు.అలాగే సమీపంలోని లాంకో చెరువును సుందరీకరించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని, సాయి వైభవ్ కాలనీలో పార్కులు, రోడ్లను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. సాయి ఐశ్వర్య లేఔట్‌లోని పార్కుల అభివృద్ధి పనులను కూడా చేపట్టాలని కోరారు.అధికారుల సానుకూల స్పందనకాలనీ ప్రతినిధుల వినతిపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేశారు. ఇగురు హోటల్ రహదారి విస్తరణకు చర్యలు తీసుకుంటామని, లాంకో చెరువు సుందరీకరణను త్వరలో చేపడతామని తెలిపారు. సాయి ఐశ్వర్య కాలనీ పార్కు అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.కాలనీల అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలంపటికి చిత్రపురి, సాయి వైభవ్, సాయి ఐశ్వర్య కాలనీల ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 18.11.2026
www.mudranews.in | @mudranews

బిర్యానీతో కూల్‌డ్రింక్ వద్దు!



బిర్యానీతో కూల్‌డ్రింక్ తాగే అలవాటు ఉంటే వెంటనే మానుకోండి. ఈ రెండింటి కలయిక వల్ల అధిక చక్కెర, క్యాలరీలు శరీరంలోకి చేరతాయి. గ్యాస్, కడుపు ఉబ్బరం, ఊబకాయం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. బిర్యానీ తర్వాత మజ్జిగ లేదా చక్కెర లేని నిమ్మరసం తీసుకోవడం మంచిది.

పోలీసు అధికారుల పదోన్నతులకు మార్గం సుగమం

డీజీపీ చొరవతో వివాదాలకు తెర
తొలి విడతలో 54 మంది డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా ప్రమోషన్లు
2027 ఆగస్టు నాటికి మరో 34 అదనపు ఎస్పీ పోస్టులు
12 మంది అడిషనల్ ఎస్పీలకు నాన్ క్యాడర్ ఎస్పీలుగా పదోన్నతులు
ప్యానల్ ఇయర్‌లో మరో 10 నాన్ క్యాడర్ ఎస్పీ పోస్టులు
1991, 1995, 1996 బ్యాచ్‌ల ప్రమోషన్ ప్యానళ్లు సిద్ధం
అధికారుల ఏకాభిప్రాయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లనున్న డీజీపీ సీవీ ఆనంద్



ముద్ర, హైదరాబాద్, నవంబర్ 17: ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పోలీసు అధికారుల పదోన్నతుల సమస్య పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడింది. సీనియారిటీ, రిజర్వేషన్ ఆఫ్ రోస్టర్ (ఆర్ఓఆర్), ఖాళీలు, అర్హతలకు సంబంధించి నెలకొన్న వివాదాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించేందుకు డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆయన ప్రయత్నాలతో అధికారుల మధ్య ఏకాభిప్రాయం కుదరడంతో పదోన్నతుల ప్రక్రియకు మార్గం సుగమమైంది.ఈ మేరకు మంగళవారం డీజీపీ కార్యాలయంలో 1991, 1995, 1996 బ్యాచ్‌లకు చెందిన సివిల్ ఎస్సైలతో డీజీపీ సమావేశమయ్యారు. వరంగల్, హైదరాబాద్ రేంజ్‌లతో పాటు హైదరాబాద్ నగరానికి చెందిన అధికారులు పాల్గొన్నారు. పదోన్నతులకు సంబంధించి సీనియారిటీ, రోస్టర్ పాయింట్లు, ఖాళీలు, అర్హతలపై విస్తృతంగా చర్చించారు.తొలి విడతలో 54 మందికి పదోన్నతులుడీఎస్పీ స్థాయి అధికారులకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పించేందుకు తొలి విడతలో 54 పోస్టులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. రెండో విడతలో 2027 ఆగస్టు నాటికి మరో 34 పోస్టులు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు 1991, 1995, 1996 బ్యాచ్‌లకు సంబంధించి పదోన్నతి ప్యానళ్లను సిద్ధం చేశారు.గతంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 74 ప్రకారం పదోన్నతుల ప్రక్రియ చేపట్టాల్సి ఉండగా, సీనియారిటీ అంశంపై కొందరు అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో వివాదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో కమిటీ నివేదిక, ప్రభుత్వ ఉత్తర్వులు, సంబంధిత నిబంధనలను సమావేశంలో సమీక్షించారు.12 నాన్ క్యాడర్ ఎస్పీ పోస్టుల భర్తీకి చర్యలు ప్రస్తుతం ఎలాంటి న్యాయపరమైన వివాదాలు, కోర్టు కేసులు లేని 12 నాన్ క్యాడర్ ఎస్పీ పోస్టులను తక్షణమే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు. వీటితో పాటు ప్యానల్ ఇయర్‌లో మరో 10 నాన్ క్యాడర్ ఎస్పీ పోస్టులు కేటాయించనున్నట్లు అధికారులు వివరించారు.ఏకాభిప్రాయానికి అధికారుల అంగీకారంఅందుబాటులో ఉన్న ఖాళీలు, రోస్టర్ పాయింట్లు, అర్హులైన అధికారుల వివరాలను డీజీపీ కార్యాలయ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సర్వీసు కాలం, సీనియారిటీ, రోస్టర్ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని తొలి, రెండో విడత పదోన్నతి జాబితాలను రూపొందించారు. ప్రతిపాదిత జాబితాలపై తమ అభిప్రాయాలను వెల్లడించిన అధికారులు, వాటి ప్రకారం ముందుకు వెళ్లేందుకు అంగీకారం తెలిపారు.ముఖ్యమంత్రి దృష్టికి ప్రతిపాదనలుసమావేశంలో కుదిరిన ఏకాభిప్రాయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు కృషి చేస్తానని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. సీనియారిటీ వివాదాలు, కోర్టు కేసులు దీర్ఘకాలం కొనసాగితే చివరకు అందరికీ నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా పదవీ విరమణకు చేరువలో ఉన్న అధికారులు పదోన్నతి అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.అర్హులైన ప్రతి అధికారికి న్యాయం జరగాలన్నదే పోలీసు శాఖ లక్ష్యమని, అదే సమయంలో ఎవరికీ అన్యాయం జరగకుండా నిబంధనల ప్రకారమే పదోన్నతులు కల్పిస్తామని స్పష్టం చేశారు. సుదీర్ఘకాలం పోలీసు శాఖకు సేవలందించిన అధికారులు పదవీ విరమణకు ముందే పదోన్నతి పొందితే వారికి తగిన గుర్తింపు, సంతృప్తి లభిస్తుందని అభిప్రాయపడ్డారు.డీజీపీ చొరవతో అధికారుల మధ్య ఏకాభిప్రాయం కుదరడం, వివాదాల పరిష్కారానికి మార్గం ఏర్పడటంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పదోన్నతుల ప్రక్రియ త్వరలోనే కొలిక్కి వస్తుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.ఈ సమావేశంలో మహిళా భద్రతా విభాగం డీజీ సౌమ్య మిశ్రా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేశ్ ఎం. భగవత్, అదనపు డీజీలు ఆకున్ సబర్వాల్, విజయ్‌కుమార్, ఐజీలు షానవాజ్ ఖాసీం, కార్తికేయ, జాయింట్ డైరెక్టర్ జోయల్ డేవిస్, జాయింట్ పోలీస్ కమిషనర్ చందనా దీప్తి, డీఐజీలు నారాయణ నాయక్, ఎల్.ఎస్. చౌహాన్‌తో పాటు పలువురు సీనియర్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సంక్రాంతి, శబరిమలకు ప్రత్యేక రైళ్లు..



ముద్ర, హైదరాబాద్, నవంబర్ 17: తెలంగాణ రాష్ట్ర ప్రజలు, ప్రయాణికులు, భక్తుల సౌకర్యార్థం రైల్వే కనెక్టివిటీని మరింత మెరుగుపరచాలని బీజేపీ రాజ్యసభ సభ్యుడు, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా. కె. లక్ష్మణ్ కోరారు. ఈ మేరకు బీజేపీ నేతల బృందంతో కలిసి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను కలిసి పలు రైల్వే సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు.రానున్న సంక్రాంతి పండుగ, శబరిమల యాత్ర నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రైళ్లు నడపాలని కోరారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, రాజమండ్రి, కాకినాడ, తిరుపతి తదితర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో ఇప్పటికే రిజర్వేషన్లు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జీఎం దృష్టికి తీసుకెళ్లారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన ప్రాంతాలకు అదనపు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఏడు కీలక ప్రతిపాదనలుఉత్తర భారతదేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం సికింద్రాబాద్ నుంచి వారణాసి, ప్రయాగ్‌రాజ్ మీదుగా అయోధ్యకు నేరుగా రైలు సర్వీసు ప్రారంభించాలని కోరారు. సికింద్రాబాద్–దానాపూర్ మధ్య అదనపు రైలు, సికింద్రాబాద్–గోరఖ్‌పూర్ మధ్య ప్రతిరోజూ ప్రత్యేక రైలు నడపాలని సూచించారు. శబరిమల యాత్రికుల కోసం సికింద్రాబాద్, చర్లపల్లి లేదా కాచిగూడ నుంచి తిరువనంతపురం వరకు అదనపు రెగ్యులర్ రైలు ఏర్పాటు చేయాలని కోరారు.హైదరాబాద్ నగర ప్రయాణికుల సౌకర్యార్థం ఫలక్‌నుమా–లింగంపల్లి మధ్య రోజంతా ఎంఎంటీఎస్ రైళ్ల ఫ్రీక్వెన్సీ పెంచాలని డా. లక్ష్మణ్ సూచించారు. ఉదయం, సాయంత్రం రద్దీ వేళలతో పాటు ఇతర సమయాల్లోనూ తక్కువ విరామంతో రైళ్లు నడపాలని కోరారు. ఫలక్‌నుమా, యాకుత్‌పురా, దబీర్‌పురా, మలక్‌పేట ప్రాంతాల ప్రయాణికులు సికింద్రాబాద్ చేరుకునేలా రైళ్ల వేళలను రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.కొత్తగా అభివృద్ధి చేసిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని, సికింద్రాబాద్, లింగంపల్లి, ఫలక్‌నుమా, కాచిగూడ నుంచి అదనపు ఎంఎంటీఎస్ సర్వీసులు నడపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని అప్రోచ్ రోడ్లు, ఆర్టీసీ బస్సులు, ఆటో, ట్యాక్సీ సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు.అలాగే, నల్లొండ జిల్లాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రామన్నపేట పట్టణ ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారుల ప్రయాణ సౌకర్యార్థం రామన్నపేట రైల్వే స్టేషన్‌లో నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ కల్పించాలని కోరారు. ఈ ప్రతిపాదనలపై సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించి రైల్వే బోర్డుకు పంపాలని జీఎంను అభ్యర్థించారు.27 శబరిమల, 40 సంక్రాంతి ప్రత్యేక రైళ్లుడా. కె. లక్ష్మణ్ వినతులపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సానుకూలంగా స్పందించారు. అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం శబరిమలకు 27 ప్రత్యేక రైళ్లు, సంక్రాంతి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు 40 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు హామీ ఇచ్చారు. మిగిలిన నూతన రైళ్లు, హాల్టింగ్‌లు, ఎంఎంటీఎస్ సర్వీసుల ప్రతిపాదనలను రైల్వే బోర్డు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ప్రశాంతంగా ముగిసిన 'గో సడక్ బంద్'

గోశాలల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ హామీ
వారం రోజుల్లో గోశాలల సందర్శన
ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని వెల్లడి
300కు పైగా ఆవులు, దూడలు, ఎద్దుల సంరక్షణపై అధికారుల పరిశీలన
గోసంరక్షణకు పోలీసుల పూర్తి సహకారం
ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు



ముద్ర, రంగారెడ్డి, నవంబర్ 17: గోవుల సంరక్షణ, గోశాలల పరిరక్షణ కోరుతూ ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో నిర్వహించిన 'గో సడక్ బంద్' కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన రైతులు, గోసంరక్షకులు, గోప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా మహేశ్వరం జోన్ డీసీపీ నారాయణరెడ్డి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. ఇంటర్మ్ కస్టడీలో ఉన్న సుమారు 300కు పైగా ఆవులు, దూడలు, ఎద్దుల సంరక్షణకు సంబంధించి గోశాలల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పశుగ్రాసం, తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల కొరతపై వివరాలు సేకరించారు.గోవుల అక్రమ రవాణాపై పోలీసుశాఖ కఠినంగా వ్యవహరిస్తోందని, నిబంధనలకు విరుద్ధంగా గోవులను తరలించే వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని డీసీపీ స్పష్టం చేశారు.జిల్లా వెటర్నరీ అధికారి అంకం రాజు, వైద్యుల బృందం గోశాలను సందర్శించి పశువుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. అవసరమైన వైద్య సేవలపై సమీక్షించారు.గోశాలల సమస్యలపై ప్రత్యేక సమావేశంగోశాలల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి స్పందించారు. టీటీడీ మాజీ బోర్డు సభ్యుడు, యుగ తులసి ఫౌండేషన్ చైర్మన్ కె. శివకుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా గోశాలల్లో పశుగ్రాసం, తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల కొరతను శివకుమార్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలో గోశాలల సమస్య పరిష్కారానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పూర్తి నివేదికలను ప్రభుత్వానికి సమర్పించి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. రానున్న వారం రోజుల్లో స్వయంగా గోశాలలను సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలిస్తానని వెల్లడించారు.గోసంరక్షణకు పోలీసుల సహకారం గోసంరక్షణ, గోశాలల నిర్వహణ సమస్యల పరిష్కారం, గోవుల అక్రమ రవాణా నిరోధం, శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం, పోలీసుశాఖ సమన్వయంతో పనిచేస్తాయని ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు తెలిపారు. గోశాలల సమస్యల పరిష్కారానికి పోలీసుశాఖ పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.

విదేశీ విద్యార్థులకు భారీ ఊరట..

ట్రంప్ సర్కారు ప్రతిపాదనను కొట్టివేసిన అమెరికా కోర్టు



ముద్ర, న్యూయార్క్: అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విదేశీ విద్యార్థులకు భారీ ఊరట లభించింది. అంతర్జాతీయ విద్యార్థులు, పరిశోధకులు, విదేశీ జర్నలిస్టుల నివాస గడువుకు పరిమితులు విధించాలని ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలను అక్కడి ఫెడరల్ కోర్టు కొట్టివేసింది. విద్యార్థుల నివాస కాలపరిమితి నాలుగేళ్లకు పరిమితం చేయడంతోపాటు, ఆ తర్వాత కొనసాగాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి చేయాలన్న హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ప్రతిపాదన చట్టవిరుద్ధమని తేల్చింది. దీంతో దశాబ్దాలుగా అమల్లో ఉన్న 'డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్' విధానం కొనసాగనుంది. ఈ తీర్పుతో అమెరికాలో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులు సహా విదేశీ విద్యార్థులకు ఊరట లభించినట్లయింది.

ట్రంప్ సర్కారు ప్రతిపాదన ఏమిటంటే?

విదేశీ విద్యార్థులు, పరిశోధకులు, జర్నలిస్టులు అమెరికాలో ఉండే కాలాన్ని నిర్దిష్ట గడువులకు పరిమితం చేయాలని కొత్త నిబంధనలను ప్రతిపాదించింది. ప్రస్తుతం ఎఫ్-1 విద్యార్థి వీసాపై అమెరికాకు వెళ్లేవారు తమ విద్యా కార్యక్రమం పూర్తయ్యే వరకు, వీసా నిబంధనలను పాటిస్తూ అక్కడ ఉండే అవకాశం ఉంది. దీన్నే 'డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్' విధానం అంటారు. అయితే ఈ విధానాన్ని తొలగించి, అంతర్జాతీయ విద్యార్థుల బసను గరిష్ఠంగా నాలుగేళ్లకు పరిమితం చేయాలని ప్రభుత్వం భావించింది. అంతకంటే ఎక్కువ సమయం అవసరమైతే డీహెచ్ఎస్ నుంచి ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సి వచ్చేది.ఈ ప్రతిపాదన ఎక్స్చేంజ్ విజిటర్లు, పరిశోధకులు, ప్రొఫెసర్లు, బోధకులకు వర్తించే జే-1 వీసాదారులతోపాటు విదేశీ మీడియా ప్రతినిధులనూ లక్ష్యంగా చేసుకుంది. విదేశీ జర్నలిస్టుల బసను 240 రోజులకు పరిమితం చేయాలని, చైనా జర్నలిస్టులకు ఈ గడువును 90 రోజులుగా నిర్ణయించాలని ప్రతిపాదించింది. విద్యార్థులకు సంబంధించి కూడా పలు మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం యోచించింది. చదువు పూర్తయిన తర్వాత లేదా చదువు అనంతరం ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (OPT) ముగిసిన తర్వాత అమెరికాను విడిచిపెట్టేందుకు ప్రస్తుతం ఇస్తున్న 60 రోజుల గడువును 30 రోజులకు తగ్గించాలని ప్రతిపాదించింది. భాషా కోర్సులు అభ్యసించే విద్యార్థులకు సెలవులు, విరామ సమయాలతో కలిపి మొత్తం 24 నెలల బస పరిమితి విధించాలని సూచించింది. నాలుగేళ్లలో కోర్సు పూర్తి చేయలేని విద్యార్థులు అదనపు సమయం కోసం ప్రభుత్వ అనుమతి పొందాల్సి వచ్చేది.

ప్రభుత్వానికి విస్తృత అధికారాలు లేవు: ఫెడరల్ కోర్టు

ట్రంప్ సర్కార్ తీసుకొచ్చిన ఈ ప్రతిపాదనలను సవాలు చేస్తూ ఉన్నత విద్యా సంస్థలు, విద్యా సంఘాలు, కార్మిక సంఘాల కూటమి కోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన మసాచుసెట్స్ జిల్లా ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి ఎఫ్. డెన్నిస్ సేలర్ నవంబర్ 16న తుది తీర్పు వెలువరించారు. DHS తీసుకొచ్చిన నిబంధనలు ఏకపక్షంగా ఉన్నాయని, చట్టానికి అనుగుణంగా లేవని పేర్కొంటూ వాటిని పూర్తిగా రద్దు చేశారు. విదేశీ విద్యార్థులకు అమెరికాలో విద్యా అవకాశాలు కల్పించాలన్నది కాంగ్రెస్ ఉద్దేశమని, ఆ అవకాశాలను అడ్డుకునేలా వ్యవహరించేందుకు DHSకు విస్తృత అధికారాలు లేవని న్యాయమూర్తి స్పష్టం చేశారు. వీసా వ్యవస్థలో మోసాలు, జాతీయ భద్రతకు సంబంధించిన ఆందోళనలను పరిష్కరించేందుకు తక్కువ భారంతో కూడిన ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించడంలోనూ ప్రభుత్వం విఫలమైందని కోర్టు అభిప్రాయపడింది. ఇప్పటికే ఉన్న పర్యవేక్షణ వ్యవస్థలను మెరుగుపరిచే అవకాశాన్ని కూడా DHS తగినంతగా పరిశీలించలేదని పేర్కొంది.

సెప్టెంబరులోనే తాత్కాలిక అడ్డుకట్ట

ఈ ప్రతిపాదిత నిబంధనల అమలును న్యాయమూర్తి సేలర్ గత సెప్టెంబరులోనే ప్రాథమిక ఉత్తర్వుల ద్వారా నిలిపివేశారు. పాత డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్ విధానాన్ని తొలగించి, వీసాదారులకు నిర్దిష్ట కాలపరిమితులు విధించేలా DHS తీసుకున్న చర్యకు అడ్డుకట్ట వేశారు. ఈ ఉత్తర్వును సవాలు చేస్తూ హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఫస్ట్ సర్క్యూట్ అప్పీళ్ల కోర్టును ఆశ్రయించింది. నవంబర్ 3న తుది తీర్పు త్వరలో వెలువడే అవకాశం ఉన్నందున విచారణను 30 రోజుల పాటు వాయిదా వేయాలని కోరింది. తాజాగా ఫెడరల్ కోర్టు తుది తీర్పు వెలువరించడంతో ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదించిన గడువు పరిమితులకు అడ్డుకట్ట పడింది. అయితే ప్రభుత్వం ఈ తుది తీర్పును కూడా ఉన్నత న్యాయస్థానంలో సవాలు చేసే అవకాశం ఉంది.

పేద విద్యార్థి ఉన్నత చదువుకు చేయూత

ఇన్నర్ వీల్ సంస్థ ద్వారా రూ. 35 వేలు ఆర్థిక సాయం అందజేసిన గద్వాల విజయలక్ష్మి
పేద విద్యార్థికి చదువుకు అండగా నిలిచిన సీఎం ప్రజావాణి



ముద్ర, హైదరాబాద్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా పాఠశాల ఫీజు రూ.35 వేలు చెల్లించలేక.. విద్యా సర్టిఫికెట్లు పొందలేక.. ఉన్నత విద్యకు ఆటంకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థి కందుకూరి యోగేశ్వర్ గుప్తాకు సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి చేయూత నిచ్చారు. ఆ విద్యార్థి సర్టిఫికెట్స్ ను స్కూల్ నుంచి పొందడానికి అవసరమైన ఫీజు రూ. 35 వేలు ఇన్నర్ వీల్ బంజారా సంస్థ ద్వారా ఏర్పాటు చేసి మంగళవారం మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్ లో నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో చెక్ ను గద్వాల్ విజయలక్ష్మి అందజేశారు.ఫీజు బకాయి ఉందనే కారణంతో విద్యార్థికి టెన్త్ క్లాస్ మెమోతో పాటు ఇతర విద్యా సంబంధిత సర్టిఫికెట్లను అందించేందుకు పాఠశాల యాజమాన్యం నిరాకరించడంతో.. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థి సమస్యను సీఎం ప్రజావాణి స్టేట్ ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థి విద్యా భవిష్యత్తుకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో గద్వాల్ విజయలక్ష్మి మానవతా దృక్పథంతో స్పందించి ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. ఇందుకు అవసరమైన రూ.35 వేల మొత్తాన్ని ఇన్నర్ వీల్ బంజారా సంస్థ అధ్యక్షులు అంజలి బన్సాల్, ఉపాధ్యక్షులు రష్మీ దోషి, కార్యదర్శి అమీతా కర్నాని ద్వారా సమకూర్చి విద్యార్థికి అండగా నిలిచారు.ఈ మొత్తాన్ని పాఠశాల ఫీజు కింద చెల్లించడంతో స్కూల్ యాజమాన్యం విద్యార్థి యోగేశ్వర్ గుప్తాకు సంబంధించిన పదో తరగతి మెమోతో పాటు ఇతర విద్యా సర్టిఫికెట్లను అందజేసింది. సీఎం ప్రజావాణిలో గద్వాల్ విజయలక్ష్మి స్వయంగా విద్యార్థికి ఆ సర్టిఫికెట్లను అందించారు.విద్యార్థుల భవిష్యత్తు ఆర్థిక పరిస్థితుల కారణంగా అంధకారంలో పీడ కూడదని, అవసరమైన సమయంలో సమాజంలోని దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి పేద విద్యార్థులకు అండగా నిలవాలని ఈ సందర్భంగా గద్వాల్ విజయలక్ష్మి ఆకాంక్షించారు.సీఎం ప్రజావాణి ద్వారా సమస్యకు పరిష్కారం లభించడంతో విద్యార్థి యోగేశ్వర్ గుప్తా, అతని కుటుంబ సభ్యులు గద్వాల్ విజయలక్ష్మికి, ఆర్థిక సహాయం అందించిన ఇన్నర్ వీల్ బంజారా సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555